మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : నంద కిషోర్ సంపుటి : 08 సంచిక : 18 ఆదివారం 15 - 06 - 2025 పేజీలు: 8 వెల: 4

## జగన్ ప్రభుత్వ హయాంలో పెట్టుబడి దారులు పారిపోయారు



2లో..

## మోదీకి లేఖ రాసిన కేఏ పాల్

### కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిపై కేఏ పాల్ కీలక వ్యాఖ్యలు



మన గళం, న్యూఢిల్లీ : అహ్మదాబాద్ లో సంభవించిన ఘోర విమాన ప్రమాదం నేపథ్యంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎంతో క్లిష్టమైన పౌర విమానయాన శాఖను నిర్వహించేందుకు రామ్మోహన్ నాయుడు సమర్థుడు కాదని, ఆయనకు తగినంత అనుభవం లేదని పాల్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయన ఒక సూచన చేశారు. పౌర విమానయాన శాఖ ఎంతో క్లిష్టమైనదని, దానిని నిర్వహించడానికి అపారమైన నైపుణ్యం, పరిణతి, అనుభవం అవసరమని కేఏ పాల్

2లో..

### పౌర విమానయాన శాఖ ఈ అంశాన్ని

## సీరియస్‌గా తీసుకున్నం

### - బ్లాక్ బాక్స్‌లో ఉన్న సమాచారం కీలకంగా మారనుంది



మన గళం, న్యూఢిల్లీ : అహ్మదాబాద్‌లో ఈ నెల 12న జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ దుర్ఘటనలో విమానంలో ఉన్న 242 మందిలో 241 మంది ప్రాణాలు కోల్పోగా.. ఒక్కరు మాత్రం మృత్యుంజయుడిగా నిలిచాడు. ఇక విమానం మెడికల్ కాలేజ్ హాస్టల్‌లోకి దూసుకెళ్లడంతో 33 మంది మెడికోలు కూడా ప్రాణాలు కోల్పోయారు. తాజాగా ఈ విమాన ప్రమాదంపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ

2 లో..



### మణిపూర్‌లో భారీగా ఆయుధాలు

## బుల్లెట్లు స్వాధీనం

మన గళం, ఇంటర్నెట్ డెస్క్: మణిపూర్‌లో అల్లరిమూకలపై భద్రతా బలగాలు ఉక్కుపాదం మోపుతున్నాయి. మణిపూర్ పోలీసులు, అసోం రైఫిల్స్, ఆర్మీ, సీఆర్‌పీఎఫ్ జాయింట్ ఆపరేషన్‌లో భారీగా ఆయుధాలు

2లో..

# లోకేష్ విసిరిన చాలెంజ్ స్వీకరించే దమ్ములేని వైసీపీ

- ☐ వైఎస్ జగన్ ఆటలు సాగవని స్పష్టం
- ☐ జగన్ కుట్రలు రాష్ట్రంలో సాగనివ్వబోం
- ☐ మహిళల్ని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయాలనుకుంటున్న జగన్
- ☐ జగన్ రాజకీయ ముసుగులో ఉన్న నేరస్థుడు
- ☐ ఆంధ్రప్రదేశ్ హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత



మన గళం, అమరావతి : వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై ఆంధ్రప్రదేశ్ హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత మరోసారి నిప్పులు చెరిగారు. శనివారం అమరావతిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ఉన్నంత వరకూ వైఎస్ జగన్ ఆటలు సాగవని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు ఎలాగైనా విఘాతం కలిగించాలని చూసే జగన్ కుట్రలు రాష్ట్రంలో సాగనివ్వబోమని ఆమె కుండ బద్దలు కొట్టారు. రాష్ట్రంలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని వివరించారు. దీనిని ఎవ్వరు విఘాతం కలిగించాలని చూసినా ఉపేక్షించేది లేదని ఆమె హెచ్చరించారు. మహిళల్ని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయాలనుకుంటున్న జగన్‌కు సిగ్గనిపించట్లేదా? అంటూ ఆమె సందేహం వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లా పొదిలిలో పోలీసులు తిరిగి ఎదురు రాళ్ల దాడి చేసి ఉంటే వైఎస్ జగన్ చుట్టూ ఎంత మంది మిగిలే వారో గుర్తుపెట్టుకోవాలంటూ వైసీపీ నేతలకు మంత్రి అనిత సూచించారు. కేజీ పొగాకు ధర కూడా తెలియకుండా రైతుల పరామర్శకు వెళ్లిన జగన్ మానసిక పరిస్థితి అర్థం చేసుకోవచ్చంటూ ఈ సందర్భంగా ఆమె వ్యంగ్యంగా పేర్కొన్నారు. పులివెందులకు మాత్రమే పరిమితమైన ఎమ్మెల్యేగా

2లో..

### విదేశీ పర్యటనకు

## ప్రధాని మోదీ



### - రెండు దశాబ్దాల తర్వాత సైప్రస్‌కు, తొలిసారిగా క్రొయేషియాకు భారత ప్రధాని

మన గళం, న్యూఢిల్లీ : దేశంలో ఇటీవల చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావడం తెలిసిందే. ఈ కీలక పరిణామం అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన తొలి విదేశీ పర్యటనకు శ్రీకారం చుట్టారు. జూన్ 15 నుంచి 19వ తేదీ వరకు ఆయన సైప్రస్, కెనడా, క్రొయేషియా దేశాల్లో పర్యటించనున్నారు. 'ఆపరేషన్ సిందూర్' ఇచ్చిన నూతనోత్సాహంతో

2 లో..



### శ్రీశైలం లెఫ్ట్ ఎస్ఎల్‌బీసీ

## టీబీఎం ఇక పనికిరాదు

మన గళం, శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) సొరంగ ప్రమాదం కారణంగా ఇన్‌లెట్‌లోని టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) పూర్తిగా దెబ్బతిన్నదని, అది ఇక పనికిరాదని, ఆ శిథిలాలను బయటకు తీయడానికి కూడా సాధ్యపడదని సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. సొరంగం శిథిలాల నుంచి బయట తీయడానికి

2లో..



### రైతులను పరామర్శించేందుకు వెళుతుంటే

## రాళ్ల దాడా.?

మన గళం, అమరావతి : రాష్ట్రంలో అన్యాయానికి గురవుతున్న రైతులను పరామర్శించేందుకు వెళుతుంటే రాళ్ల దాడి చేయించారని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్ర విమర్శలు చేశారు. ఈ మేరకు ఈరోజు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి జగన్ ట్వీట్ చేశారు. పొగాకు పంటకు కనీస మద్దతు ధరలు లభించక రైతులు అన్యాయానికి గురవుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలో ప్రకాశం జిల్లాలోని పొదిలిలో రైతులను పరామర్శించి భరోసా చెప్పేందుకే తాను అక్కడికి వెళ్లానని జగన్ తెలిపారు. తన పర్యటనకు సంఘీభావంగా దాదాపు 40 వేల మంది రైతులు, ప్రజలు తరలి వచ్చారని జగన్ తెలిపారు. అయితే, తాము వెళ్తున్న మార్గంలో 40 మంది టీడీపీ కార్యకర్తలను పెట్టి, వారితో రాళ్లు విసిరి గలాటా

2లో..

### వైసీపీ ఆరోపణలు నిరూపిస్తే

## రాజీనామా చేస్తా



- తల్లికి వందనంపై వైసీపీ ఆరోపణలు
- ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే వైసీపీ ఇలాంటి ఆరోపణలు చేస్తోందని ఫైర్

మన గళం, అమరావతి : తల్లికి వందనం పథకంపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను నిరూపిస్తే తాను ఎమ్మెల్యే, మంత్రి పదవులకు రాజీనామా చేస్తానని, ఒకవేళ నిరూపించలేకపోతే పులివెందుల ఎమ్మెల్యే పదవికి జగన్ రాజీనామా చేయగలరా? అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత సవాల్ విసిరారు.

2లో..

### స్వచ్ఛందంగా

## రక్తదానం చేయండి



మన గళం, అమరావతి : ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ విజ్ఞప్తి చేశారు. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం 2025ను 'రక్తాన్ని ఇవ్వండి. ఆశను ఇవ్వండి. కలిసి మనం ప్రాణాలను కాపాడుదాం' అనే ఇతివృత్తంలో జరుపుకుంటున్నట్లు వివరించారు. రాష్ట్రంలో విద్యార్థులు, యువత అందరూ ఏపీ రెడ్‌క్రాస్ మొబైల్ యాప్ ద్వారా రక్తదాతలుగా నమోదు చేసుకోవాలని, స్వచ్ఛంద రక్తదానికి ముందుకు వచ్చి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 20 రెడ్‌క్రాస్ రక్త కేంద్రాల్లో రక్తదానం చేయాలని కోరారు.

## మోదీకి లేఖ రాసిన కేఏ పాల్

మొదటి పేజీ తరువాయి

అన్నారు. 37 ఏళ్ల రామ్మోహన్ నాయుడు ఉత్సాహవంతుడు, చిత్తశుద్ధి కలిగిన వ్యక్తి అయినప్పటికీ, ఈ కీలక శాఖను నడిపించడానికి అవసరమైన సామర్థ్యం ఆయనకు ఇంకా రాలేదని పాల్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంతటి సున్నితమైన, సాంకేతికంగా అత్యంత కీలకమైన శాఖ బాధ్యతల నుంచి రామ్మోహన్ నాయుడిని తప్పించాలని ఆయన ప్రధానమంత్రికి సూచించారు. విమానయాన రంగం అనేక సవాళ్లతో కూడుకున్నదని, దానికి తగిన అనుభవజ్ఞులను మంత్రిగా నియమించాల్సిన అవసరం ఉందని పాల్ పరోక్షంగా తెలిపారు.

## మణిపూర్‌లో భారీగా ఆయుధాలు బుల్లెట్లు స్వాధీనం

మొదటి పేజీ తరువాయి



స్వాధీనం చేసుకున్నారు. ఐదు జిల్లాల్లో సోదాలు చేసిన భద్రతా బలగాలు 328 అధునాతన ఆయుధాలను సీజ్ చేశాయి. 151 రైఫిళ్లు, 65 ఇన్సాస్ రైఫిళ్లు స్వాధీనం చేసుకున్నారు. 9,300 రౌండ్ల బుల్లెట్లతోపాటు.. భారీగా పేలుడు పదార్థాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు .. మణిపూర్‌లోని ఇంఫాల్ లోయలోని ఐదు జిల్లాల్లో సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించారు. ఇంఫాల్ తూర్పు, ఇంఫాల్ పశ్చిమ, బిష్ణుపూర్, కాక్చింగ్, తౌబాల్ అనే ఐదు లోయ జిల్లాల శివార్లలో జూన్ 13–14 మధ్య రాత్రి నిఘా వర్గాల నేతృత్వంలో దాడులు నిర్వహించినట్లు మణిపూర్ పోలీసులు తెలిపారు. "ఉమ్మడి బృందాలు పేలుడు పదార్థాలు, ఇతర ఆయుధాల నిల్వలను స్వాధీనం చేసుకున్నాయి. 151 రైఫిల్, 65 ఇన్సాస్ రైఫిల్స్, ఇతర రకాల 73 రైఫిల్స్, 5 కార్బైన్ గన్, 2 –5 గన్, భారీగా బుల్లెట్ నిల్వలను స్వాధీనం చేసుకున్నాయి" అని మణిపూర్ పోలీసు లారి డోర్జీ లాటూ తెలిపారు. మొత్తం తుపాకులు, రైఫిళ్లు 328 స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పారు. మణిపూర్‌లో శాంతిభద్రతలు కాపాడడానికి ప్రజలకు సహకరించాలని పోలీసు అధికారులు విజ్ఞప్తి చేశారు. అరాచకశక్తులపై పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని కోరారు ఏడీజీపీ డార్జీ. ఎట్టి పరిస్థితుల్లో కూడా రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడుతామని వెల్లడించారు. సాధారణ స్థితిని పునరుద్ధరించడానికి అందరూ సహకరించాలని.. మణిపూర్ పోలీసులు, భద్రతా దళాలు కోరాయి.

## శ్రీశైలం లెఫ్ట్ ఎస్ఎల్‌బీసీ టీబీఎం ఇక పనికిరాదు



మొదటి పేజీ తరువాయి

సాధ్యపడదు అత్యాధునిక టెక్నాలజీతో పక్క నుంచి మరో సొరంగం తవ్వుతాం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) సొరంగ ప్రమాదం కారణంగా ఇన్‌లెట్‌లోని టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) పూర్తిగా దెబ్బతిన్నదని, అది ఇక పనికిరాదని, ఆ శిథిలాలను బయటకు తీయడానికి కూడా సాధ్యపడదని సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. అత్యాధునిక టెక్నాలజీతో పక్కనుంచి మరో సొరంగ నిర్మాణం చేపడతామని తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర జల్‌శక్తి, రక్షణ శాఖ మంత్రులతోపాటు సీడబ్ల్యూసీ చైర్మన్, ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్‌ను మంత్రి ఉత్తమ్ బుధవారం కలిశారు. అనంతరం అక్కడి మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలను వెల్లడించారు.

## రైతులను పరామర్శించేందుకు వెళుతుంటే రాళ్ల దాడా..?

మొదటి పేజీ తరువాయి



చేయించారని ఆరోపించారు. ఈ రాళ్ల దాడి వెనకున్న పన్నాగాన్ని అర్థం చేసుకున్న ప్రజలు, రైతులు అత్యంత సంయమనంతో వ్యవహరించారని చెప్పారు. రాళ్ల దెబ్బలు తిన్న వైసీపీ కార్యకర్తలు, రైతులపైనే పోలీసు కేసులు బనాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రైతుల సమస్యలను పట్టించుకోకుండా, తిరిగి వారిపైనే ఎదురు కేసులు పెట్టడం మీకు మాత్రమే చెల్లుతుంది అంటూ జగన్ ట్వీట్ చేశారు. ఆ నలభై మంది టీడీపీ కార్యకర్తలపై అక్కడున్న 40 వేల మంది ప్రజలు తిరగబడి ఉంటే ఏం జరిగి ఉండేదని జగన్ ప్రశ్నించారు. రైతుల సమస్యలను పరిష్కరించాలి, అన్యాయాన్ని సరిదిద్దాలని కోరితే తానేదో విషయాన్ని డైవర్ట్ చేయడానికి ప్రయత్నిస్తున్నానని ఆరోపించడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు.

## పౌర విమానయాన శాఖ ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నం

మొదటి పేజీ తరువాయి

సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. విమాన ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు సంతాపం వ్యక్తం చేశారు. గడిచిన రెండు రోజులు భారంగా గడిచిందని.. ప్రమాదంలో ఎవరైనా చనిపోతే ఆ కుటుంబం అనుభవించే బాధ తనకు ప్రత్యేకంగా తెలుసన్నారు. నాకు బాధితుల బాధ తెలుసు. నా తండ్రి గతంలో రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. విమాన ప్రమాదం జరిగిన వెంటనే నేను సంఘటనా స్థలానికి చేరుకుని చర్యలు చేపట్టాం. ప్రమాదం స్థలాన్ని పరిశీలించాను. గుజరాత్ ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టింది. వీలైనంత సహాయక చర్యలు గుజరాత్ ప్రభుత్వం వెంటనే చేపట్టింది' అని తెలిపారు. పౌర విమానయాన శాఖ ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుందన్నారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మెడికల్, ఫోరెన్సిక్, టీమ్‌లతో పాటు ఐదుగురితో ఏఐబీ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. బ్లాక్ బాక్స్‌ను ఇప్పటికే స్వాధీనం చేసుకున్నామని... అందులో ఉన్న సమాచారం కీలకంగా మారనుందని తెలిపారు. బ్లాక్ బాక్స్‌లో ఉన్న సమాచారం రానున్న రోజుల్లో కీలకమని చెప్పుకొచ్చారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి చైర్మన్ నేతృత్వంలో కమిటీ వేసినట్లు తెలిపారు. హోంశాఖ కార్యదర్శి, సివిల్ ఏవియేషన్ సెక్రటరీ, గుజరాత్ అధికారులు, పోలీసు కమిషనర్ అహ్మదాబాద్, స్పెషల్ డైరెక్టర్ ఐబీని ఈ కమిటీలో నియమించినట్లు చెప్పారు.

ఈ కమిటీ మూడు నెలల్లో విచారణ పూర్తి చేసి నివేదిక ఇస్తుందన్నారు. భద్రతా ప్రమాణాలు పెంచేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రమాదం తెలిసిన వెంటనే బోయింగ్ 787 సిరీస్‌కు చెందిన విమానాలను పరిశీలించాల్సిందిగా డీజీసీఏకు ఉత్తర్వులు ఇచ్చామన్నారు. బోయింగ్ విమానాలు దేశంలో 34 ఉన్నాయని.. ఇప్పటికే 8 విమానాలను



ఇన్స్పెక్షన్ చేసినట్లు చెప్పారు. డీఎన్ఏ టెస్టులు కూడా జరుగుతున్నాయన్నారు. 24 గంటల్లోనే ప్రధాని మోదీ ప్రమాద స్థలాన్ని పరిశీలించారన్నారు. హై లెవెల్ కమిటీతో సోమవారం (జూన్ 16) భేటీ అవనున్నట్లు తెలిపారు. గడిచిన 48 గంటల నుంచి ప్రజలకు అన్ని విషయాలు తెలియజేస్తున్నామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# విదేశీ పర్యటనకు ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి

ప్రధాని చేపడుతున్న ఈ యాత్ర, అంతర్జాతీయంగా భారత్ ప్రాముఖ్యతను మరింత పెంచుతుందని దౌత్య వర్గాలు భావిస్తున్నాయి. ఈ పర్యటన వివరాలను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) శనివారం అధికారికంగా ప్రకటించింది. పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ తొలుత జూన్ 15, 16 తేదీలలో సైప్రస్‌లో ఉంటారు. ఆ దేశ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ప్రత్యేక ఆహ్వానం మేరకు ఈ పర్యటన ఖరారైంది. విశేషమేమిటంటే, రెండు దశాబ్దాల తర్వాత ఒక భారత ప్రధాని సైప్రస్‌ను సందర్శించడం ఇదే మొదటిసారి. నికోసియాలో అధ్యక్షుడు క్రిస్టోడౌలిడెస్‌తో ప్రధాని మోదీ ఉన్నత స్థాయి చర్చలు జరుపుతారు. అనంతరం లిమాసోల్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్నారు. ఈ భేటీలు మధ్యధరా ప్రాంతం మరియు యూరోపియన్ యూనియన్‌తో భారతదేశపు వ్యూహాత్మక బంధాలను కొత్త శిఖరాలకు చేర్చుతాయని ఆశిస్తున్నారు. ఆ తర్వాత, జూన్ 16, 17 తేదీల్లో కెనడాలోని కాననాస్కిస్‌లో జరిగే ప్రతిష్ఠాత్మక జీ–7 శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ పాల్గొంటారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు ఆయన ఈ సదస్సుకు హాజరవుతున్నారు. ప్రధాని మోదీ జీ–7 సదస్సులో పాలుపంచుకోవడం ఇది వరుసగా ఆరోసారి కావడం గమనార్హం. ఈ వేదికపై ఇంధన భద్రత, ఆధునిక సాంకేతికత, కృత్రిమ మేధ (ఏఐ)–ఇంధన రంగాల అనుసంధానం, క్వాంటం టెక్నాలజీ వంటి కీలక అంశాలపై ప్రధాని తన అభిప్రాయాలను పంచుకుంటారు. పలు దేశాధినేతలతో ద్వైపాక్షిక సమావేశాలు కూడా నిర్వహించనున్నారు.

ఈ విదేశీ పర్యటన చివరి అంకంలో, జూన్ 18న ప్రధాని మోదీ క్రొయేషియాను సందర్శిస్తారు. క్రొయేషియా ప్రధాని ఆండ్రెజ్ ప్లెన్కోవిక్ ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరగనుంది. ఒక భారత ప్రధాని క్రొయేషియాలో పర్యటించడం ఇదే ప్రప్రథమం కావడంతో దీనికి చారిత్రక ప్రాధాన్యత ఏర్పడింది. భారత్–క్రొయేషియా సంబంధాలలో ఇదొక సువర్ణాధ్యాయమని విదేశీ వ్యవహారాల శాఖ అభివర్ణించింది. ఈ పర్యటన ద్వారా యూరోపియన్ యూనియన్‌లోని ముఖ్య దేశాలతో భారత్ సంబంధాలు మరింత పటిష్టం అవుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## వైసీపీ ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా చేస్తా

మొదటి పేజీ తరువాయి

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. 'తల్లికి వందనం' పథకం కింద కేటాయించిన నిధులలో రూ.2 వేలు నారా లోకేశ్ జేబుల్లోకి వెళ్లాయని వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలపై మంత్రి సవిత ఘాటుగా స్పందించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే వైసీపీ ఇలాంటి ఆరోపణలు చేస్తోందని, కానీ ప్రజలు ఇప్పటికే వారిని పక్కనపెట్టారని, ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకపోవడమే దీనికి నిదర్శనమని అన్నారు.

– 'తల్లికి వందనం'తో తల్లుల ఖాతాల్లోకి నేరుగా నిధులు

ఎన్డీయే ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేసి మాట నిలబెట్టుకున్నారని సవిత తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 67 లక్షల 27 వేల 164 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా రూ.8,745 కోట్లు జమ చేశామని, దీంతో తల్లిదండ్రులు, పిల్లలు సంతోషంగా ఉన్నారని వివరించారు. ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు ఇస్తుండగా, అందులో రూ.2 వేలు పాఠశాల అభివృద్ధికి, మిగిలిన రూ.13 వేలు తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. "ఇంట్లో ఒకరుంటే రూ.13 వేలు, ఇద్దరుంటే రూ.26 వేలు, ముగ్గురుంటే రూ.39 వేలు, నలుగురుంటే రూ.52 వేలు, ఐదుగురుంటే రూ.65 వేలు అందజేశాం. ఒక కుటుంబంలోని ముగ్గురు ఆడబిడ్డలకు ఈ పథకం అందడంతో వారు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు" అని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు తీరుస్తూ కూడా ఈ పథకాన్ని అమలు చేయడం గొప్ప విషయమని, ఇందులో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ ల కృషి ఎనలేనిదని ప్రశంసించారు. గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ అమ్మఒడి



ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక మాట మార్చి ఒకరికే పరిమితం చేసిందని మంత్రి సవిత ఆరోపించారు. "జగన్ గారు ఎన్నికల ముందు 'నా చెల్లెమ్మలు, నా ఆడపడుచులు, వారి బిడ్డలకు నేను మేనమామ' అని చెప్పుకున్నారు. అధికారంలోకి వచ్చాక కంసమామగా మారారు. 2022–23లో కేవలం 42 లక్షల 61 వేల మందికే రూ.5,500 కోట్లు ఇచ్చారు. మేము అదనంగా దాదాపు 25 లక్షల మందికి లబ్ధి చేకూర్చాం" అని సవిత వివరించారు.

## లోకేష్ విసిరిన చాలెంజ్ స్వీకరించే దమ్ము లేని వైసీపీ

మొదటి పేజీ తరువాయి

గుర్తుపెట్టుకోవాలంటూ వైఎస్ జగన్‌కు ఈ సందర్భంగా ఆమె సూచించారు. కూటమి ప్రభుత్వంలో మహిళలు, తల్లులు సంతోషంగా ఉండటాన్ని వైసీపీ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. ప్రతిపక్ష హోదా కూడా లేని ఓ విపక్ష పార్టీ కడుపు మంట చూస్తే నవ్వొస్తుందని ఎద్దేవా చేశారు. అమరావతి గురించి కొందరు వెధవలు చేసిన వ్యాఖ్యల్ని జగన్ సమర్థించటం సిగ్గు చేటు అంటు వ్యాఖ్యానించారు. సాక్షి జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు నిర్దోషి అంటూ సుప్రీంకోర్టు ఎక్కడా నిర్ధారించలేదని గుర్తు చేశారు. ఎలాంటి టీవీ డిబేట్లు నిర్వహించకూడదని కొమ్మినేనికి సుప్రీంకోర్టు షరతులతో కూడిన బెయిల్ మాత్రమే మంజూరు చేసిందని సోదాహరణగా మంత్రి వంగలపూడి అనిత వివరించారు. వైఎస్ జగన్, వైఎస్ భారతీతో క్షమాపణలు చెప్పించడానికి సమావేశం పెట్టుకోవాలంటూ వైసీపీ నేతలకు మంత్రి అనిత హితవు పలికారు. సాటి మహిళల్ని కించపరిస్తే ఆ అంశాన్ని సమర్థించుకోవడానికి వైసీపీ మహిళా నేతలు సమావేశం పెట్టుకోవడాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. పులివెందుల ఎమ్మెల్యేగా కూడా మిగలని పరిస్థితిని వైఎస్ జగన్ తెచ్చుకుంటున్నాడని జోస్యం చెప్పారు. తల్లికి వందనం నిధులపై లోకేష్ విసిరిన ఛాలెంజ్ స్వీకరించే దమ్ము ఒక్కరికి కూడా లేకపోయిందంటూ వైసీపీ నేతలపై మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన శక్తి యాప్‌కు, గత ప్రభుత్వం తెచ్చిన బూటకపు దిశ యాప్‌కు పొంతనే లేదన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే అభివృద్ధిని అడ్డుకోవచ్చనే కుట్రతో జగన్ కిందా మీద పడుతున్నారని విమర్శించారు. జగన్ రాజకీయ ముసుగులో ఉన్న నేరస్థుడు కాబట్టే రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి చూసి ఓర్వలేక పోతున్నాడన్నారు. పోలీసులు మీద రాళ్లు విసిరితే మాకు బీపీలు రావా? అని ప్రశ్నించారు. మాకు బీపీలు వచ్చినా, చేసిన అవమానాలకు కడుపు మండినా సంయమనం పాటిస్తున్నామని మంత్రి వంగలపూడి అనిత గుర్తు చేశారు. డైవర్షన్ పాలిటిక్స్‌ను జగన్ పేటెంట్ తీసుకున్నాడని ఎద్దేవా చేశారు. జగన్ తన నియోజకవర్గానికి వస్తే ఐదుగురు పిల్లల ఉన్న తల్లులకు తల్లికి వందనం పడిన వారిని చూపిస్తానని చెప్పారు. డీఎస్సీ నిలుపుదల చేయటానికి సుప్రీంకోర్టు వరకూ వెళ్లి కుట్రలు చేయలేదా? అంటూ వైసీపీ నేతలపై ఆయన మండిపడ్డారు.

## జగన్ ప్రభుత్వ హయాంలో పెట్టుబడి దారులు పారిపోయారు

మన గళం, అమరావతి : గత జగన్ ప్రభుత్వ హయాంలో పెట్టుబడి దారులు ఏపీ నుంచి పారిపోయారని మంత్రి కొలుసు పార్థసారథి విమర్శించారు. విద్యావిధానం పటిష్ట పరిచేందుకు విద్యార్థులకు స్కిల్ డెవలప్ చేస్తున్నామని అన్నారు. స్త్రీ శక్తి ద్వారా మహిళల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని అన్నారు. మహిళలను అవమానపరిచేలా వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. దేశ అత్యున్నత న్యాయస్థానంలో చాలామంది వైసీపీ నేతలకు బెయిల్ దొరకటం లేదని చెప్పారు. ఇవాళ(శనివారం) అమరావతిలో మంత్రి కొలుసు పార్థసారథి మీడియాతో మాట్లాడారు. కేవలం ఓ వ్యక్తికి బెయిల్ దొరికితేనే అంతా బాగున్నట్లుగా వైసీపీ నేతలు ప్రవర్తించటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. కూటమి సర్కార్ ఏడాది పాలనలో తమకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను ఏడాది పాలనలో అమలు చేశామని ఉద్ఘాటించారు మంత్రి కొలుసు పార్థసారథి.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకున్నారు

**– తెదేపా కర్నూలు జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి**

మన గళం,కర్నూలు సిటి : తెలుగుదేశంపార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ,రాష్ట్ర విధ్యాశాఖా మాత్యులు నారా లోకేష్ గత సార్వత్రిక ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించారనీ, అధికారంలోకి రాగానే వాటిని అమలు చేస్తూ ప్రజల కిచ్చిన మాటనిలుపుకున్నారని అందుకు వారికి కర్నూలు జిల్లా తెలుగుదేశంపార్టీ తరుపు తెలుగుదేశంపార్టీ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. శనివారం జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఇతర నాయకులతో కలిసి పత్రికల వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిన్నటి రోజు తేది 13-06-2025న తల్లికి వందరం కింద ప్రతి తల్లికి తన సంతానంలో ఎంతమందిని చదివిస్తుంటే అంతమంది పిల్లలకి ఒక్కొక్కరికి రూ. 13వేలు చొప్పున వారి భ్యాంక్ కాతాలో జమచేసి ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చుకున్నారనీ, అయితే వై.యస్.ఆర్.సి.పి. నాయకులు మాత్రం ఇది జీర్ణించుకోలేక ర్యాగించేసినట్లు తల్లికి వందనం మీకు వచ్చిందా ! మీకు వచ్చిందా! అంటూ విధ్యార్థుల తల్లిదండ్రులను అవహేలనగా ప్రశ్నిస్తు వారి అసూయను వెళ్లగక్కుతున్నారని అన్నారు. వై.సి.పి. వారు నిజాలు తెలుసుకోవాలనుకుంటే 23వ తేదీ నుండి మా వెంట రండి ఇంటింటికి వెళదాము తల్లికి వందనం కింద ఎవరికి ఎంత వచ్చిందీ విధ్యార్థుల తల్లిదండ్రులే మీకు చెపుతారని సవాల్ చేశారు. ఇటీవల జగన్ పొగాకు రైతుల గురించి కపట ప్రేమను ప్రదర్శించారనీ, పొగాకు ధర ప్రపంచ మార్కెట్కు అనుగుణంగా నిర్యయించబడుతుందనీ, దానికి కొంత రాయితీని రాష్ట్ర ప్రభుత్వం కలిపి ఇస్తుందన్న విషయం కూడా జగన్కు తెలియకపోవడం విడ్డూరంగా ఉందనీ అన్నారు. దీనిని అసరాగా చేసుకొని రౌడీమూకలను వెంటబెట్టుకొని వచ్చి మహిళలపై రాళ్లు వేయించారు అది జగన్ నైజమనీ వారు పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు గారు ఒక విజన్ తో ముందుకు వెల్తున్నారనీ, ఇందులో భాగంగా రాయలసీమను, ముఖ్యంగా కర్నూలు జిల్లాను అభివృద్ధి పథంలో పయనింపచేస్తున్నారనీ గుర్తుచేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, తనకున్న పాలనానుభవంతో రాష్ట్రాన్ని అభివృద్ధిపథం వైపుకు నడిపిస్తున్నారనీ, పోలవరం, అమరావతి నిర్మాణాలను కూడా త్వరితగతిన పూర్తిచేసేందుకు కృషిచేస్తున్నారనీ తెలియజేశారు. తల్లికి వందనం అమలుతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ 80% హామీలను ఇప్పటికే అమలు చేసి ప్రజల మద్దతుతో ముందుకు వెల్తుంటే వై.సి.పి. నాయకులు జీర్ణించుకోలేక తమ కున్న అబద్దపు ప్రచార సాధనాల ద్వారా ప్రభుత్వంపై విషంచిమ్ముతూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారనీ, ప్రజలు గమనించాలనీ వారు ప్రజలకు విజ్ఞప్తిచేశారు. గతంలో వై.సి.పి. వారు అదికార మదంతో చేసిన పాపాలకు ప్రజలు శిక్షవేశారు 11 సీట్లు ఇచ్చారు. అయినా వారు ఇంకా భ్రమలో ఉన్నారని తామే తిరిగి అధికారంలోకి వస్తామని కలలు కంటున్నారనీ, ఇక ప్రజలు తమను విశ్వసించరనీ గ్రహించి జగన్రెడ్డి దాడులకు కుట్రలు చేస్తున్నారనీ, వారి కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలనీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పుల్లయ్య చౌదరి, కె. మహేష్ గౌడ్, సత్రం రామక్రిష్ణుడు, డి. జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్ముడుపోయిన కర్నూలు జిల్లా డీఈవో శామ్యూల్ పాల్

**– కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం.**
**– పుస్తకాలు, యూనిఫామ్ పేరుతో జరిగే వ్యాపారాన్ని అడ్డుకుందాం**
**– ఎస్ఎఫ్ఐ నేతలు**

మన గళం,కర్నూలు సిటి : భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర కమిటీ ఆధ్వర్యంలో కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నందు నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర అధ్యక్ష కార్యదర్శులు అబూబకర్, సాయి ఉదయ్ మాట్లాడుతూ కార్పొరేటర్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి అయిన శామ్యూల్ పాల్ చర్యలు తీసుకోవడంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. పుస్తకాలు యూనిఫామ్ పేరుతో పెద్ద ఎత్తున వ్యాపారం జరుగుతున్న చర్యలు లేవు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో నర్సరీ చదివే విద్యార్థికి 30 వేల రూపాయలు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు. అలాగే పదో తరగతి విద్యార్థికి లక్ష రూపాయలు పైబడి వస్తువులు చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి నిద్ర మత్తులో ఉన్నట్టు వ్యవహరిస్తున్నారు. అక్షరాలతో లక్షల రూపాయలు వసూలు చేస్తున్న చర్యలు తీసుకోవడంలో లోపం ఎందుకని భావిస్తే విద్యాశాఖ అధికారి గారు కార్పొరేట్ విద్యా సంస్థలకు అమ్ముడుపోయారని ఎస్ఎఫ్ఐ గా భావిస్తున్నాం. ఇప్పటికైనా డీఈవో గారు ప్రభుత్వ నిబంధనలు తుంగలో తోసి అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి. ఫీజు రెగ్యులేషన్ కమిటీని పటిష్టం చేసి ఫీజు నిర్ణయాల పట్టిక




విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ గా కోరుకుంటున్నాం. లేనియెడల విద్యార్థులని తల్లిదండ్రులని కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళనలకు దివాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో కర్నూలు నగర ఉపాధ్యక్షులు ఆర్యన్, మల్లేష్ నగర సహాయ కార్యదర్శులు పృథ్వి, ఆదిత్య నగర కమిటీ సభ్యులు చరణ్, యోగి, హేమంత్, గ్రీష్మంత్, భాస్కర తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రపంచ రక్తదాన దినోత్సవం

మన గళం,కర్నూలు వైద్యం : నగరంలోని స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో శనివారం ప్రపంచ రక్తదాన దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్, డా.కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆసుపత్రి ఆవరణ నుండి రాజ్ విహార్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, ధన్వంతరి హాల్ లో వివిధ సొసైటీ వారు ఎంతో మందికి రక్తదానం చేసిన వారికి మెమొంటో మరియు శాలువాతో సత్కరించి వారు చేస్తున్న సేవలను కొనియాడారు. రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడాలని ప్రతి ఒక్కరికి పిలుపునిచ్చారు అనంతరం రక్తదానం చేస్తే ఎంతో మందికి ప్రాణదానం చేసినట్లు అవుతుందని అని అన్నారు. "ప్రపంచ రక్తదాతల దినోత్సవం" సందర్భంగా.. రక్తదానాన్ని ప్రోత్సహించండి. ఆపదలో, అత్యవసర శస్త్రచికిత్సల్లో వున్నవారి కోసం ప్రాణదాత కాండీ అని అన్నారు. కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్, డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ:- ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎంతో మంది రక్తం లేక చనిపోతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని అందువల్ల ప్రతి ఒక్కరు విధిగా తమ రక్తాన్ని బ్లడ్ బ్యాంకుల్లో దానం చేయాలని దీని వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉండవని అన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని అని అన్నారు. ఈ




కార్యక్రమానికి ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్, సింధు సుబ్రహ్మణ్యం, అడిషనల్ డీఎంహెచ్ఓ, మరియు లెప్రసి టీబి మెడికల్ ఆఫీసర్, డా.భాస్కర్ రాజు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్, డా.కిరణ్ కుమార్, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్, డా.రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాకు పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉద్యోగాలు ఇప్పిస్తాం

**– పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి.భరత్**

మన గళం,కర్నూలు పాతబస్తీ : రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం జిల్లా కు పరిశ్రమలు తీసుకుని రావడానికి, విధ్యాభివృద్ధికి చాలా కృషి చేస్తున్నదని పరిశ్రమలు,వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి.భరత్ పేర్కొన్నారు. శనివారం ఉదయం కర్నూలు పట్టణ ఉస్మానియా కాలేజీ ఆవరణలో నిర్మించిన రాష్ట్రీయ ఉచ్చతర శిక్ష అభియాన్ ( రూసా ) ఆధ్వర్యంలో ఒక కోటి రూపాయలతో నిర్మించిన అదనపు తరగతుల భవనాన్ని ప్రారంభించిన రాష్ట్ర పరిశ్రమలు,వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి.భరత్. ఈ కార్యక్రమంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు ,మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలేజీ విద్యార్థులు మరియు సిబ్బందిని ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ... ఉస్మానియా కళాశాల పూర్వపు విద్యార్థి అయిన నేను రాష్ట్ర మంత్రిగా రూసా నిర్మించిన అదనపు తరగతుల భవనాలను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కళాశాలలోని సిబ్బంది అందరితోనూ నాకు పరిచయాలు ఉన్నాయని తెలిపారు. ఈ కళాశాలలో చదువుకున్న వారిలో చాలామంది విదేశాల్లో స్థిరపడ్డారని , రాజకీయాల్లో కూడా బాగానే రాణిస్తున్నారని తెలిపారు. ఈ కళాశాలలో మంచి అనుభవం ఉన్న సిబ్బంది ఉన్నారని విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ బస్తిపాటి నాగరాజును ఉద్దేశించి లెక్చరర్ గా అనుభవం ఉన్న మీరు ఈ కాలేజీ విద్యార్థులకు లెక్చరర్ గా మరియు మెంబర్ అఫ్ పార్లమెంట్ గా ఉన్న మీ అనుభవాన్ని విద్యార్థులతో పంచుకోవాలని మంత్రి కోరారు .2018 వ సంవత్సరం లో మొదలుపెట్టిన ఈ భవనాలను రాష్ట్ర ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కాలంలో ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ నిర్మాణ పనులని కూడా పూర్తి చేస్తామని తెలియజేశారు .గత ప్రభుత్వ ఐదు సంవత్సరాల కాలంలో అభివృద్ధి జరగలేదని తెలియజేశారు. జిల్లాలో పరిశ్రమలను తీసుకుని వచ్చి యువతకు ఉద్యోగాలు కల్పించే బాధ్యత మంత్రిగా నేను తీసుకుంటున్నానని , కావున విద్యార్థులు మీరు చదివిన , చదువుతున్న డిగ్రీలతో పాటు అదనంగా ఉద్యోగం సాధించటానికి అవసరమైన విజ్ఞానాన్ని సమపార్జించు కోవాలని కోరారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు విద్యార్థుల సంక్షేమం కొరకు చాలా కార్యక్రమాలు చేపడుతున్నారని కొనియాడారు. ఈ కూటమి ప్రభుత్వం అన్ని రకాలుగా విద్యార్థులకు మేలు చేసే కార్యక్రమాలు నిర్ణయాలు తీసుకుంటూ ఉండదని తెలిపారు. స్థానిక ప్రజల కోరిక మేరకు ఉస్మానియా కళాశాలలో వాకింగ్ ట్రాక్ నిర్మించే చర్యలు తీసుకుంటామని మంత్రి తెలియజేశారు. కర్నూలు పాతబస్తీలో రోడ్లు ఇరుకుగా ఉన్నాయని కావున స్థానిక ప్రజలు రోడ్లు వెడల్పు చేయటానికి సహకరించాలని ఈ సందర్భంగా మంత్రి కోరారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ రూసా నిధులతో అదనపు తరగతుల నిర్మాణాలకు ప్రారంభోత్సవం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు కర్నూలు పర్యటనకు వచ్చినప్పుడు డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ స్థలాలను చూపించి వాటి నిర్మాణాలను త్వరగా పూర్తిచేసే చర్యలు తీసుకోవాలని కోరామని తెలియజేశారు. ఉస్మానియా కాలేజీ తో నాకు చాలా అనుబంధం ఉన్నదని ఎంపీ తెలుపుతూ తాను 1994- 96 సంవత్సరాల లో ఎంఎస్సీ, బీఈడీ పరీక్షలు ఈ కళాశాలలోనే రాయడం జరిగిందని తెలియజేశారు .ఈ కళాశాల విద్యార్థి ఆయన మంత్రి భరత్ ఈ కళాశాల లో అదనపు భవనాలను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ స్థానిక ప్రజల కోరిక మేరకు ఉస్మానియా కాలేజీ లో వాకింగ్ ట్రాక్ కు చర్యలు తీసుకుంటామని అలాగే ట్రాఫిక్ అంతరాయం లేకుండా రోడ్ల వెడల్పు చేసే కార్యక్రమాలు చేపడతామని




అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ మరియు కరస్పాండెంట్లు మాట్లాడుతూ... 1992 బ్యాచ్ ఉస్మానియా కాలేజీ విద్యార్థి అయిన టిజి .భరత్ మంత్రిగా కళాశాలకు రావడం అదనపు భవనాలను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి టి జీ .భరత్ మరియు ఎంపీ బస్తిపాటి నాగరాజును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు , మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు , కాలేజీ ప్రిన్సిపల్ ఎస్ ఎస్ ముజామిల్, సెక్రటరీ మరియు కరస్పాండెంట్ అజ్రా జావేద్, రూస ఇంచార్జ్ డాక్టర్ ఎస్. గజని,కార్పొరేటర్ పరమేష్ , కళాశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




# రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి

**– రక్త దాతలకు కృతజ్ఞతలు – జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**




మన గళం,కర్నూలు సిటి : రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ ఆవరణంలో వైద ఆరోగ్య శాఖ, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ రక్త దాత దినోత్సవం నిర్వహించారు.. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో రక్తదానాన్ని ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం జూన్ 14 వ తేదీన ప్రపంచ రక్త దాత దినోత్సవంగా జరుపుకుంటామన్నారు..అన్ని దానాల కంటే ప్రాణాలను నిలిపే రక్తదానం చాలా గొప్పదన్నారు.. రక్తదానం చేసిన వ్యక్తులను జూన్14 వ తేదీన ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా సన్మానం చేసుకుంటామన్నారు.. అదే విధంగా వారి సేవలకు కృతజ్ఞతలు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు... రక్తదానం చేయడం ఆరోగ్యానికి కూడా ఎంతో మంచిదన్నారు...ప్రపంచ రక్తదాతల దినోత్సవం థీమ్ ప్రతి సంవత్సరం మారుతూ ఉంటుందని, తమకు తెలియని వ్యక్తుల కోసం తమ రక్తాన్ని దానం చేసే నిస్వార్థ వ్యక్తులకు గుర్తింపుగా, ఈ సంవత్సరం "రక్తం ఇవ్వండి, ఆశను ఇవ్వండి కలిసి మనం ప్రాణాలను కాపాడుకుందాం" అనే థీమ్ తో ప్రపంచ రక్తదాతల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం 5 కోట్ల మందికి రక్తం అవసరం ఉందన్నారు . బ్లడ్ డొనేషన్ కేంద్రాల ద్వారా కేవలం 3.5 కోట్లు మాత్రమే డొనేట్ అవుతుందన్నారు.. ఇంకా 1.5 కోట్లు కొరత ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.. రాష్ట్రంలో 6.5 లక్షల మందికి రక్తం అవసరం ఉంటే కేవలం 4 లక్షలు మాత్రమే డొనేట్ అవుతుందన్నారు.. కర్నూలు జిల్లాలో 45 వేలు అవసరం ఉంటే 35 వేల మాత్రమే డొనేట్ అవుతుందన్నారు.. ఆ కొరత ఉండడంతో రక్తం అత్యవసరం ఉండే వారు రక్తం దొరకక మరణించే అవకాశం ఉంటుందన్నారు..రక్తదానం చేయడం ద్వారా మనిషి ప్రాణాలను కాపాడే అవకాశం ఉందని ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కలెక్టర్ కోరారు. ప్రజల్లో రక్తదానం మీద అవగాహన కల్పించి రక్తదానం చేసే విధంగా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా పలువురు రక్తదానం చేశారు.. వారికి కృతజ్ఞతలు తెలుపుతూ వారికి కలెక్టర్ జిల్లా సర్టిఫికెట్ లు అందచేశారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డా.శాంతి కళ, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డా కేజీ గోవిందరెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ కర్నూల్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ ట్రెజరర్ రఘునాథ్ రెడ్డి,మాజీ చైర్మన్ శ్రీనివాసులు,కమిటీ మెంబర్లు,శ్రీమతి అరుణ, మధుసూదన,ప్రభాకర్ రెడ్డి,నరసింహ,భీమా శంకర్ రెడ్డి, ఎం జె.బాబురాజు,కె.వి సుబ్బారెడ్డి, మీనాక్షి,సెక్రటరీ వెంకట కృష్ణుడు,మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు..

# జులై 9 జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి.

మన గళం,కర్నూలు సిటి : కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానానికి నిరసనగా జులై 9న జరుగు సార్వత్రిక సమ్మెలో కార్మికులు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి అంజిబాబు పిలుపునిచ్చారు. శనివారం కార్మికుల కర్షక భవన్లో సిఐటియు కార్యాలయంలో కర్నూలు సిఐటియు జిల్లా కమిటీ సమావేశం సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ అధ్యక్షతన జరిగింది.. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి అంజిబాబు మాట్లాడుతూ.1986 అమెరికాలోని చికాగో నగరంలో కార్మిక వర్గం 8 గంటల పని విధానం కోసం ప్రాణ త్యాగాలు చేసి పోరాటాలద్వారా8గంటలపనిదినాలుసాధించుకున్నారు పోరాడీ సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లుగా మార్చికార్మిక హక్కులనుహరించియజమానులకు అనుకూలంగాచట్టాలను చేస్తున్నది. దీనికి వ్యతిరేకంగా కార్మిక వర్గం పెద్ద ఎత్తున పోరాటాల్లో కార్మికులు పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. బిజెపి పాలితరాష్ట్రాల్లో ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటల పని విధానాన్ని అమల్లోకి తెచ్చారని అదే బాటలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం బిజెపి నరేంద్ర మోడీకి తలవొగ్గి ఆంధ్రప్రదేశ్లో కూడా ఎనిమిది గంటల పని విధానాన్ని మార్చి 10గంటలపనివిధానాన్నితీసుకురావాలని మహిళలు రాత్రి షిఫ్ట్ ల్లో కూడాడ్యూటీలుచేయాలనిరాష్ట్రక్యాబినెట్ సమావేశం లో నిర్ణయంచేయడం చాలా దుర్మార్గమని వారన్నారు. కార్మికులుఉద్యోగులు కలిసి ఐక్య పోరాటం ద్వారా కూటమి ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే విధంగా పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు ఆంధ్రప్రదేశ్ కు పక్కనే ఉన్న కేరళ రాష్ట్రంలోనరేంద్రమోడీతీసుకువచ్చిన లేబర్ కోడ్లను అమలు చేయము కార్మికుల పనిగంటలు మార్చము కార్మికుల హక్కులుకాపాడుతామని కార్మికుల పక్షాన నిలబడతామని కార్మికుల పక్షాన ఆ ప్రభుత్వం నిలబడిదని వారన్నారు.చంద్రబాబు నాయుడు ఉద్యోగ కార్మికుల హక్కుల జోలికి వెళ్లకుండా కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసే విధంగా





చర్యలు చేపట్టకపోతే గతంలో జగన్మోహన్ రెడ్డి కి పట్టిన గతే కూటమి ప్రభుత్వానికి పడుతుందని వారు హెచ్చరించారు జులై 9 వ తారీఖున దేశవ్యాపిత సమ్మె లో ఉద్యోగులు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా అన్ని మండల లో మండల కమిటీలు పట్టణ కమిటీలు వేసి కార్మికులను సమ్మెకు సన్నద్ధం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ సాయిబాబా, వీరన్న నారాయణ స్వామి, నాశగేశ్వరరావు, విజయ్, కెప్రభాకర్, నగర నాయకులు నరసింహులు, అబ్దుల్ దేశాయ్, మహమూద్ వలి వెంకటేశ్వర్లు కే.సుధాకరప్ప, మండల నాయకులు రాముడు, వీరన్న, మోహన్, రాజు, ఆషారంగం, అంగన్వాడి భవన నిర్మాణం ఆటో మెడికల్ రిప్రజెంటివ్ యూనియన్ మధ్యాహ్న భోజనం నాయకులు పాల్గొన్నారు.

# 23న జరిగే పరుగులో పాల్గొందాం

**– మాజీ మంత్రి కేఈ ప్రభాకర్**

మన గళం,కర్నూలు స్పోర్ట్స్ : ప్రపంచ ఒలంపిక్ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీ సోమవారం కర్నూల్ నగరంలో ఒలంపిక్ డే రన్ నిర్వహించడం జరుగుతుంది ఒలంపిక్ అసోసియేషన్ చైర్మన్ కె.ఈ. ప్రభాకర్ పిలుపునిచ్చారు ఈ సందర్భంగా నగరంలోని కె.ఈ ప్లాజా లో ఏర్పాటుచేసిన ఒలంపిక్ రన్ లోగోను శనివారం ఆయన లాంఛనంగా ఆవిష్కరించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒలంపిక్ పరుగులో ప్రతి ఒక్కరం భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు అలాగే జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడలను ప్రోత్సహించే ప్రతి ఒక్కరు ప్రాతినిధ్యం వహించాలన్నారు .ఈ పరుగు నగరంలోని నాలుగు ప్రాంతాలు అనగా స్టేడియం వన్ టౌన్ పోలీస్ స్టేషన్, సిల్వర్ జూబ్లీ కాలేజ్, చెన్నమ్మ సర్కిల్ ప్రాంతాల నుండి ర్యాలీ ప్రారంభమై రాజ్ విహార్ కు చేరుకొని అక్కడి నుండి మౌర్యాని మీదుగా కొనసాగుతూ అవుట్ డోర్ స్టేడియం కు చేరుకోవడం జరుగుతుంది. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు అధ్యక్ష కార్యదర్శులు కేఈ జగదీష్ కుమార్ జి శ్రీనివాసులు సీఈవో విజయ్ కుమార్ ఉపాధ్యక్షులు షరీఫ్ అహ్మద్ క్రీడా సంఘాల ప్రతినిధులు రుద్రారెడ్డి అవినాష్ సతీష్ కుమార్ కబడ్డీ సంఘం కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు



# ఏపీలో డీఎస్సీ పరీక్షల తేదీలను మార్చిన ప్రభుత్వం

మన గళం, ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ నియామక పరీక్ష (డీఎస్సీ) తేదీల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో, ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 20, 21 తేదీల్లో జరగాల్సిన డీఎస్సీ పరీక్షలను వాయిదా వేసి, వాటిని జూలై 1, 2 తేదీల్లో నిర్వహించనున్నట్లు డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి శనివారం ఒక అధికారిక ప్రకటనలో వెల్లడించారు. విశాఖపట్నం సాగర తీరంలో జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా హాజరుకానున్నారు. సుమారు ఐదు లక్షల మందితో యోగాసనాలు వేయించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమం దృష్ట్యా, ప్రభుత్వ యంత్రాంగం మొత్తం ఆ పనుల్లో నిమగ్నమై ఉంటుందని, అదే సమయంలో రవాణా సౌకర్యాలు కూడా పరిమితంగా అందుబాటులో ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పరీక్షలు నిర్వహిస్తే అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారన్న ఆలోచనతో ప్రభుత్వం ఈ వాయిదా నిర్ణయం తీసుకుంది. డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి విడుదల చేసిన ప్రకటన ప్రకారం, వాయిదా పడిన పరీక్షలకు సంబంధించిన అభ్యర్థులు తమ సవరించిన హాల్‌టికెట్లను జూన్ 25వ తేదీ నుంచి అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ హాల్‌టికెట్లలో కొత్త పరీక్షా కేంద్రాలు, మార్చిన తేదీల వివరాలు స్పష్టంగా పొందుపరచబడతాయని ఆయన తెలిపారు. అభ్యర్థులు ఈ మార్పులను గమనించి, కొత్త హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని, దాని ప్రకారమే పరీక్షలకు హాజరు కావాలని కృష్ణారెడ్డి సూచించారు. అభ్యర్థుల సౌకర్యాన్ని, రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకూడదన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

# విద్యారంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుంది



**– ఎం.పి బస్తిపాటి నాగరాజు**

మన గళం,కర్నూలు పాతబస్తీ : రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు అన్నారు.. నగరంలోని ఉస్మానియా కళాశాలలో రూ.1.40 కోట్ల రూసా నిధులతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను రాష్ట్ర మంత్రి టీజి భరత్ తో కలిసి ఆయన ప్రారంభించారు..ఈ సందర్భంగా ఎం.పి నాగరాజు మాట్లాడుతూ ఉస్మానియా కళాశాలతో తనకు చాలా అనుబంధం ఉందని, ఇక్కడే తాను బీఈడీ పరీక్షలు రాశానన్నారు.. పరీక్షలు రాసిన కళాశాలకు ఎంపీ హోదాలో రావడం ఆనందంగా ఉందన్నారు..ఇక అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ లో నిలిచిన నిర్మాణలను త్వరగా పూర్తి చేస్తామని, యూనివర్సిటీకి కావాల్సిన మౌలిక వసతులను కల్పించేందుకు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు.. ఈ కార్యాక్రమంలో మున్సిపల్ కమీషనర్ రవీంద్ర బాబు, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ముజామిల్, కరస్పాండెంట్ ఆజ్రా జావేద్, కళాశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మదర్సాలపై కావాలని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు

**– రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు సూరి మన్సూర్ అలీ ఖాన్**



మన గళం,కర్నూలు సిటి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మదర్సాలు, మసీదుల అభివృద్ధికి కృషి చేస్తోందని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు సూరి మన్సూర్ అలీ ఖాన్ పేర్కొన్నారు. నగరంలోని రోజా వీధిలోని మదర్సా వద్ద రోజా మసీదు ప్రపోజ్‌డ్ కమిటీ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో రోజా వీధిలో ఉన్న మదర్సాను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. మదర్సా నిర్వహణ గురించి ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. తమ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక్కొక్క వ్యవస్థను క్రమపద్ధతిలో గాడిలో పెడుతున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే రోజా వీధిలోని మదర్సా ద్వారా ఆదాయం పొందేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ విషయంపై ఇప్పటికే వక్ఫ్ బోర్డు అధికారులను సంప్రదించి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. మదర్సా ద్వారా వచ్చే ఆదాయాన్ని రోజా మసీదు నిర్వహణకు ఉపయోగించాలన్న ఆలోచనలో ఉన్నామన్నారు. ఎందుకంటే ప్రతి నెలా రోజా మసీదు నిర్వహణకు రూ. 20 వేల నుండి రూ.25వేల దాకా ఖర్చవుతుందన్నారు. మసీదుకు వచ్చే ఆదాయం కంటే ఖర్చు అధికంగా ఉందని పేర్కొన్నారు. మదర్సాను ఇప్పుడు ప్రతి రోజూ ఒక గంటసేపు ట్యూషన్ చెప్పే సమయానికి మాత్రమే ఉపయోగించుకుంటున్నారని చెప్పారు. సమీప ప్రాంతంలోనే మరొక మదర్సా కూడా ఉన్నట్లు తెలిపారు. రెండు మదర్సాలు దగ్గరగా ఉండటం వల్ల ఈ మదర్సా ఎక్కువగా ఉపయోగపడటం లేదన్నారు. ఇక్కడకు వచ్చే 15 మంది విద్యార్థులు రోజా మసీదులో విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో దీని ద్వారా ఆదాయం వచ్చేలా చేసి.. వచ్చే డబ్బును రోజా మసీదు నిర్వహణకు ఉపయోగించుకుంటే ఎంతో మేలు జరుగుతుందన్నారు. అయితే కొందరు గిట్టని వ్యక్తులు దీనిపై విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర మంత్రి టి.జి భరత్ అనుచరులు మదర్సాలను కబ్జా చేస్తున్నారని తప్పుడు సందేశాలు ప్రజల్లోకి తీసుకెళ్తున్నారన్నారు. మంత్రి టి.జి భరత్ మదర్సాలు, మసీదుల అభివృద్ధి కోసం పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. వక్ఫ్ బోర్డు భూములు కబ్జాకు గురవ్వకుండా ఆయన చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ తప్పుడు ప్రచారాలు ప్రజలు నమ్మొద్దని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు సూరి మన్సూర్ అలీ ఖాన్ ప్రజలను కోరారు.

# మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో బ్యాంగిల్స్ మేళా



మన గళం,కర్నూలు సిటి : మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షో రూంలో బ్యాంగిల్స్ ఫెస్ట్ ఘనంగా ప్రారంభించారు. బ్యాంగిల్స్ మేళాను మలబార్ గోల్డ్ కష్టమర్ లక్ష్మీ తో పాటు మరికొందరితో కలిసి ప్రారంభించారు. ఈనెల 14వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఈబ్యాంగిల్స్ మేళా కొనసాగనుందని మలబార్ గోల్డ్ నిర్వహకులు రఫీ తెలిపారు. ఈమేళలో ఎన్నో రకాల బ్యాంగిల్స్ ప్రదర్శనలో పెట్టారని మహిళలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మలబార్ గోల్డ్ షోరూంలో మంచి డిజైన్లతో పాటు నాణ్యమైన బంగారు లభిస్తుందని కష్టమర్లు తెలిపారు. ఈకార్యక్రమంలో రఫీ, నూరుల్లా, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి చిత్ర పటానికి పాలాభిషేకం చేసిన మహిళలు



మన గళం,కర్నూలు రూరల్ : తల్లికి వందనం కార్యక్రమం అమల కావడంతో మహిళలు, చిన్నారులు సంతోషంగా ఉన్నారు. కర్నూలు సమీపంలోని మామిదాలపాడు గ్రామంలో క్లస్టర్ ఇంచార్జ్ వై. రామేశ్వర రాష్ట్ర ఆధ్వర్యంలో గ్రామస్తులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఇంట్లో ఒకరికి మాత్రమే అమ్మ ఒడి పథకం అమలు చేస్తే తల్లి కి వందనం పథకంలో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ అమలు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈసందర్భంగా రామేశ్వర రెడ్డి మాట్లాడుతూ తల్లికి వందనం కార్యక్రమం అమలు చేయరని విమర్శలు చేసిన ప్రతి పక్ష నేతలు ఇప్పుడు ఎక్కడ దాక్కున్నారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ నేత పురంధరేశ్వరికి ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమం లో ఈ.మోహన్ మురళి చౌదరి, మున్న బాష,సుంకులమ్మ, సరస్వతి, పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ సిబ్బంది న్యాయమైన డిమాండ్ లను ప్రభుత్వం పరిష్కరించాలి



మన గళం,కర్నూలు సిటి : కర్నూలు నగర పాలక సంస్థ లో పని చేస్తున్న ఇంజనీరింగ్ సిబ్బంది నిరసన కార్యక్రమము లో కర్నూలు జిల్లా కెడిసిసి మాజీ అధ్యక్షురాలు ఎస్వీ విజయ మనోహరి గారు సందర్శించి సంఘీభావం తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీరింగ్ సిబ్బంది చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నారని జీతాలు పెంచి అదేవిధంగా ఇతర తాత్కాలిక సిబ్బందికి లభిస్తున్నట్లు సంక్షేమ పథకాల కూడా అర్హులను చేయాలని కోరారు. ప్రభుత్వం ఇంజనీరింగ్ సిబ్బందిని మరియు శానిటేషన్ వర్కర్స్ పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించరాదని ఇతర సిబ్బందికి లభించే విధంగా 69 రోజుల సెలవును కూడా మంజూరు చేయాలని ఉద్యోగంలో మరణించిన వారి కుటుంబాల కు పెన్షన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు మున్సిపల్ కార్మికులకు వైఎస్ఆర్సిపి పార్టీ అండగా నిలుస్తుందని వారికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో 43 వ కార్పొరేటర్ మునియమ్మ, మల్లి,%ర్% బాబు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# 15 వ తేదీ నుండి 30 వ తేదీ వరకు ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ ద్వారా గిరిజనులకు లబ్ది చేకూర్చే కార్యక్రమాల నిర్వహణ

**– జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా**

మన గళం,కర్నూలు కలెక్టరేట్ : ఈ నెల 15 వ తేదీ నుండి 30 వ తేదీ వరకు ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ ద్వారా గిరిజనులకు లబ్ది చేకూర్చే కార్యక్రమాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శనివారం ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ బెనిఫిట్ శాచురేషన్ క్యాంపుల నిర్వహణ పై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 500 లేదా అంతకంటే ఎక్కువ జనాభా కలిగిన, కనీసం 50% గిరిజన నివాసితులు కలిగిన గ్రామాలలో ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకాన్ని అమలు చేయడం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 15 వ తేదీ నుండి 30 వ తేదీ వరకు ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ ద్వారా గిరిజనులకు బెనిఫిట్ శాచురేషన్ క్యాంపులను నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కర్నూలు జిల్లా లో 07 గ్రామాలను ఈ పథకం కింద ఎంపిక చేయడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. మంత్రాలయం మండలం లోని పరమాన్ దొడ్డి, నెరణికి, హొళగుంద మండలం లోని హొళగుంద,కోగిలతోట, మద్దికెర మండలం లోని పెరవలి, మద్దికెర (తూర్పు), హంపా గ్రామాల్లో ఈ పథకం అమలు జరుగుతోందని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ గ్రామాల్లో గిరిజనులకు పక్కా గృహాలు, రోడ్లు, జల జీవన మిషన్ ద్వారా నీటి సరఫరా, ఆధార్ కార్డ్ లు, రేషన్ కార్డులు, ఆయుష్మాన్ కార్డులు,కాస్ట్ సర్టిఫికెట్లు, పెన్షన్లు, గ్యాస్ కనెక్షన్లు, కిసాన్ క్రెడిట్ కార్డ్స్, ముద్ర లోన్స్, పీఎం విశ్వకర్మ తదితర అన్ని ప్రయోజనాలు అందేలా చూడాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. 17 శాఖల ద్వారా ఈ అభివృద్ధి కార్యక్రమాలు అన్నీ పూర్తి స్థాయిలో అమలు కావాలని, అందుకు సంబంధించిన వివరాలను ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి తులసిదేవి, సంబంధిత మండలాల ఎంపీడీవోలు లైన్ డిపార్ట్మెంట్స్ అధికారులు పాల్గొన్నారు.

# శ్రీశైలం అన్నదనానికి భారీ విరాళం



మనగళం శ్రీశైలం: ఈ రోజు (14.06.2025) దేవస్థానం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద వితరణ విరాళం రూ.1,00,116/-లను శ్రీ జె. నిరంజన, మైసూర్, కర్ణాటక వారు విరాళాన్ని అందజేశారు. పర్యవేక్షకులు యం. రవికుమార్ కుఅందజేయడం జరిగింది. దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేయబడ్డాయి

# యోగా సాధనతో మానసిక ప్రశాంతత



**– నగరపాలక మేనేజర్ యన్.చిన్నరాముడు**
**– యోగా దినోత్సవం కోసం సన్నాహక ప్రదర్శన**
**– 17న 5 వేల మంది పారిశుద్ధ్య కార్మికులతో యోగా**

మన గళం,కర్నూలు నగరపాలక సంస్థ : ప్రతి రోజూ యోగ ఆసనాలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని నగరపాలక సంస్థ మేనేజర్ యన్.చిన్నరాముడు అన్నారు. శనివారం ఆయన బుధవారపేటలోని 30వ సచివాలయ పరిధిలో యోగా దినోత్సవం కోసం సన్నాహక సాముహిక ప్రదర్శనలో పాల్గొని, యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని, యోగా వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తూ, సమాజంలో యోగాను విస్తృతంగా తీసుకెళ్తున్నామన్నారు. యోగాంధ్ర మాసోత్సవంలో భాగంగా శనివారం నగరంలో అన్ని సచివాలయాల పరిధిల్లో సన్నాహక సాముహిక ప్రదర్శనలు చేపట్టామని, వేలాది మంది ప్రజలు ఇందులో పాల్గొన్నారని పేర్కొన్నారు. ఈ నెల 17న ఔట్‌డోర్ స్టేడియంలో 5 వేల మంది పారిశుద్ధ్య కార్మికులతో యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గడిచిన మూడు వారాలుగా విద్యార్థులు, యువత, మహిళలు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు ఉత్సాహంగా ఆసనాల్లో పాల్గొనడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు. మేనేజర్‌తో పాటు ఆర్ఐ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం
15 - 06 - 2025

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

మౌలిక వసతులతో ప్రగతికి బాటలు

దేశ ప్రగతి మౌలిక సదుపాయాల వృద్ధిపై ఆధారపడి ఉంటుంది. పౌరులకు అవసరమైన సేవలు అందించడం వీటితో సాధ్యపడుతుంది. మౌలిక సదుపాయాల కల్పన ఒక్క రోజులో జరిగే పని కాదు. దీర్ఘకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలతో ప్రభుత్వాలు పనిచేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో ఇతర దేశాలపై ఆధారపడకుండా, స్వయం సమృద్ధితో దేశీయంగా సాంకేతికతను అభివృద్ధి చేసుకుంటూ, అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేసుకోవడం ఎంతో అవసరం. మన దేశం అంతర్జాతీయ అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందడంలో ఈ వసతులదే కీలక భూమిక. దీనిని గుర్తించిన నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దార్శనిక దృక్పథంతో పనిచేస్తూ మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యతను కల్పించింది. వీటి కల్పనలో స్థిరమైన వృద్ధిని కొనసాగించడం, జాప్యాన్ని నివారిస్తూ సకాలంలో ప్రాజెక్టులను పూర్తిచేయడం మరొక కీలక అంశం. ఈ రెండింటినీ సమన్వయం చేస్తూ పనిచేస్తేనే నిర్ధారిత లక్ష్యాలను చేరుకోగలం. దేశానికి పట్టుకొమ్మలైన గ్రామాలను పట్టణాలతో అనుసంధానించే ప్రక్రియలో భాగంగా గ్రామీణ రహదారుల నిర్మాణం గత 11 సంవత్సరాలలో వేగం పుంజుకోవడం శుభపరిణామం. దేశంలో దాదాపుగా 99 శాతం గ్రామాలను అనుసంధానించే కార్యక్రమం పూర్తిచేశారు. రైల్వే లైన్ల డబ్లింగ్, రైలు మార్గాల విద్యుదీకరణ, మేక్ ఇన్ ఇండియాలో భాగంగా దేశంలో తొలిసారిగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ స్వదేశీ సెమీ, హై స్పీడ్ రైళ్లు పరుగులు తీయడం నిర్ధారిత లక్ష్యాన్ని చేరుకోవడానికి నిదర్శనం. అందుబాటు వ్యయంతో ప్రజలకు విమాన ప్రయాణ స్వప్నాన్ని సాకారం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం పనిచేసింది. గత దశాబ్ద కాలంలో 85 విమానాశ్రాయాల నిర్మాణాన్ని పూర్తి చేశారు. వీటితో పాటు 73 విమానాశ్రయాలు, 13 హెలిపోర్టులు, 2 జల విమానాశ్రయాలను ఉడాన్ పథకంతో అనుసంధానించారు. పెద్ద నగరాలకు పరిమితమైన మెట్రో రైలు సౌకర్యాన్ని గత పదేళ్లలో 23 నగరాలకు చేరువ చేశారు. రవాణా వ్యయాన్ని తగిస్తూ అంతర్జాతీయ వాణిజ్యానికి చేయూతనిస్తూ అంకుర సంస్థలు, వ్యాపారులు, రైతులకు నూతన అవకాశాలను చేరువ చేయడానికి కృషి చేస్తున్నారు. పీఎం గతిశక్తి జాతీయ బృహత్ ప్రణాళిక(ఎన్‌ఎంపీ)లో భాగంగా వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలతో సమగ్ర, సమీకృత ప్రణాళిక రూపొందించే దిశగా ఒక ప్రగతిశీల విధానంగా దీనిని తీర్చిదిద్దారు. 2014 నుంచి 2024 మధ్య రోడ్డు రవాణా, జాతీయ రహదారుల బడ్జెట్ 570 శాతం పెరిగింది. అంతర్జాతీయ ప్రమాణాలతో 400 వందే భారత్ రైళ్ల తయారీ లక్ష్యంలో భాగంగా ప్రస్తుతం 136 రైళ్లు ప్రజలకు వేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తున్నాయి. అలాగే రోజువారీ జాతీయ రహదారుల సగటు నిర్మాణ వేగం 2025లో 34 కిలోమీటర్లకు చేరింది. రైలు ప్రయాణ మరణాల తగ్గింపు లక్ష్యంగా 2024 నుంచి రైల్వే బడ్జెట్‌ను 9 రెట్లు పెంచారు. 2014లో 248 కిలోమీటర్లకు పరిమితమైన మెట్రో సౌకర్యాన్ని 2025 నాటికి 1013 కిలోమీటర్లకు కేంద్ర ప్రభుత్వం విస్తరించింది. గడచిన ఐదేళ్లలో 3600 కిలోమీటర్ల మేర హై స్పీడ్ కారిడార్లను నిర్మించారు. అమృత్, అమృత్ 2.0 పథకాలలో భాగంగా 6,933 పట్టణాభివృద్ధి ప్రాజెక్టులను పూర్తిచేశారు. 2014 నుంచి గ్రామీణ ప్రాంతాలలో 3.96 లక్షల కిలోమీటర్ల రహదారులను నిర్మించారు. జాతీయ రహదారుల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. 2020%-%21లో రోజువారి సగటున 37 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేస్తూ సరికొత్త రికార్డు లిఖించారు. ఢిల్లీ%-%వడోదర ఎక్స్‌ప్రెస్ వేలో 2.5 కిలోమీటర్ల పొడవైన 4 వరుసల కాంక్రీట్ పేవ్‌మెంట్‌ని కేవలం 24 గంటల్లో పూర్తిచేశారు. ప్రపంచంలో అత్యంత ఎత్తయిన చీనాబ్ రైల్వే వంతెనను ఇటీవల ప్రారంభించారు. పదివేల అడుగుల ఎత్తున ప్రపంచంలోనే అత్యంత పొడవైన హైవే సొరంగం అటల్ టన్నెల్ నిర్మాణం దేశానికే గర్వకారణం. సుదర్శన్ సేతు నిర్మాణం, ముంబాయిలో నిర్మించిన అటల్ సేతు, నూతన పంబన్ వంతెన వంటివి మౌలిక వసతుల కల్పనలో కేంద్ర ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనాలు. దశాబ్దాలుగా పూర్తికాని యూపీలోని సరయూ నహర్ ఇరిగేషన్ కెనాల్, బీహార్‌లోని కోసీ రైల్ మహాసేతు, కేరళలో కొల్లాం బైపాస్ ప్రాజెక్టు, బ్రహ్మపుత్ర నదిపై బోగీబీల్ రైలు%-%రోడ్డు వంతెన, ఢిల్లీ చుట్టూ పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్‌వే వంటివి పూర్తిచేశారు. మౌలిక వసతుల కల్పన, అనుసంధానంలో జరిగిన వృద్ధి వల్ల దేశీయంగా, అంతర్జాతీయంగా వ్యాపార, వాణిజ్య రంగాలు బలోపేతమవుతాయి. తద్వారా ఉపాధి అవకాశాలు పెరిగి, ప్రజల ఆర్థిక పురోభివృద్ధి మరింత మెరుగవుతుంది. భవిష్యత్ భారతావనికి అవసరమైన మౌలిక వసతుల కల్పన దశాబ్దకాలంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోంది.

## భారీగా రేషన్ బియ్యం స్వాధీనం

- మాజీ ఎమ్మెల్యే అండతోనే బియ్యం మాఫియా దందా..?
- ఫుడ్ కమిషన్ మెంబర్ ఆకస్మిక తనిఖీ



మన గళం,ఆదోని : ఆదోని పట్టణంలో భారీగా రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సిరుగుప్ప చెక్ పోస్ట్ సమీపంలో దాదాపు 1500 బస్తాల రేషన్ బియ్యం నిల్వ ఉంచారన్న సమాచారంతో రేషన్ బియ్యం ఉన్న ప్రదేశానికి ఫుడ్ కమిషన్ మెంబర్ మహేష్ నాయుడు వెళ్లారు. ఆయన రావడాన్ని గమనించిన రేషన్ బియ్యం మాఫియా ఫుడ్ కమిషన్ మెంబర్ ను అడ్డుకున్నారు. అయితే అధికారుల సహకారంతో గోదాము తాళాన్ని పగలగొట్టి ఆయన తనిఖీ చేశారు. వందల సంఖ్యలో రేషన్ బియ్యం బస్తాలు గోదాములో ఉన్నట్టు గుర్తించి, రేషన్ బియ్యాన్ని అధికారుల సమక్షంలో సీజ్ శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్ఆర్సిపి నాయకులు రేషన్ అక్రమ రవాణా చేస్తున్నారన్న సమాచారంతో తాను ఘటనా స్థలానికి వచ్చానని, అయితే గోడౌన్ తాళాలు వేసి తనను రేషన్ మాఫియా అడ్డుకున్నారన్నారు. గోడౌన్ లో దాదాపు వందల బస్తాలు రేషన్ బియ్యం నిల్వ ఉంచారని,ఇది చేస్తోంది మాజీ ఎమ్మెల్యే, అలాగే వైసిపి నాయకులు అని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో కూడా వైఎస్ఆర్సిపి నాయకులు బరితెగించి బియ్యం వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని,కూటమి ప్రభుత్వం అక్రమ రేషన్ బియ్యం రవాణా చేస్తే సహిందన్నారు. కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొస్తే చూస్తూ ఊరుకోమన్నారు.

## ఆదోని మండల నూతన తాహశీల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన ఏం.ఏ.రమేష్



మన గళం, : గతంలో పత్తికొండ ఎమ్మార్వోగా విధులు నిర్వహించిన ఏం ఏ రమేష్ బదిలీల్లో భాగంగా ఆదోని ఎమ్మార్వోగా నియామకం . శనివారం ఉదయం ఎమ్మార్వో గా బాధ్యతలు స్వీకరణ. నూతన ఎమ్మార్వో ను సన్మానించిన ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది. అనంతరం ఎమ్మార్వో మాట్లాడుతూ మండలంలో వివిధ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్న నేరుగా తనను సంప్రదించాలని ప్రజలకు స్పష్టం చేశారు.

## దమ్ముంటే మాయమైన బియ్యం పై దర్యాప్తు జరిపించాలి

మన గళం,ఆదోని : ఆదోని పట్టణంలోని సిరుగుప్ప క్రాస్ దగ్గర పట్టుబడ్డ రేషన్ బియ్యం మాయం పై స్పందించారు ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఆయన మాట్లాడుతూ.. సివిల్ సప్లై కార్పొరేషన్ మెంబర్ అయినటువంటి సురేష్ నాయుడు అనవసరంగా వైసిపి నాయకులపై అలాగే తనపై విమర్శలు చేశారని తమ ప్రమేయం ఉంటే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్నది కూటమి ప్రభుత్వమని దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. బియ్యం వ్యాపారం చేస్తున్నది కూటమి నాయకులని అందువల్లే సీజ్ చేసిన బియ్యాన్ని రాత్రికి రాత్రే మాయం చేశారని మాయమైన బియ్యం పై దర్యాప్తు జరిపించి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనవసర విమర్శలు మంచిది కాదని అధికారంలో కూటమి ఉంటే వైఎస్ఆర్సిపి నాయకులు బియ్యం వ్యాపారం చేస్తున్నారని విమర్శించడం ఏంటని సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ కు చిత్తశుద్ధి ఉంటే బియ్యం వెనకాల ఎవరున్నా చర్యలు తీసుకోవాలని సూచించారు .

## ఇంటికి ఒక ఉద్యోగం, పొలం... జడ శ్రవణ్ కుమార్.



మన గళం కొలిమిగుండ్ల : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం, పొలం ఇస్తామని జై భీమ్ రావ్ భారత్ పార్టీ వ్యవస్థాపకుడు జడ శ్రవణ్ కుమార్ శనివారం అన్నారు. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలంలో జై భీమ్ రావ్ పార్టీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు వంకదారి చిన్న చెన్నప్ప ఆధ్వర్యంలో జై భీమ్ పార్టీ కార్యాలయం ప్రారంభించడానికి కొలిమిగుండ్ల వచ్చిన జడ శ్రవణ్ కుమార్ కార్యాలయం ప్రారంభ అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ పార్టీ కి 2019లో 151 సీట్లు ఇస్తే రాష్ట్రాన్ని పాలించడంలో జగన్మోహన్ రెడ్డి ఫెయిల్యూర్ కావడంతో తిరిగి 2024 లో తెలుగుదేశం పార్టీకి 164 సీట్లు ఇచ్చి వైఎస్ఆర్సిపికి 11 సీట్లు ఇచ్చారన్నారు. తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ప్రజలకు మంచి పాలన ఇవ్వకుంటే ప్రజలు మరుస్తారని అన్నారు. ఎప్పుడు చూసినా వైఎస్ఆర్సిపి, తెలుగుదేశం పార్టీ వీళ్లే రాష్ట్రాన్ని పాలించాల మరొకరు రాకూడదా?? ఈసారి 2029లో జై భీమ్ రావు భారత్ పార్టీ ఎన్నికలకు పోయి కచ్చితంగా విజయం సాధిస్తాము.అని ఆయన దిమ వ్యక్తం చేశారు. అధికారం మా చేతికి వస్తే ప్రతి పేదవానికి న్యాయం చేస్తామని ఆయన అన్నారు. వైసిపి ప్రభుత్వం లోనైనా టిడిపి ప్రభుత్వంలోనైనా దళిత బిడ్డలు అత్యాచారానికి లోనై హత్యలకు గురవు తున్నారని ఆడబిడ్డలో హత్యలు అరికట్టడం లో ప్రభుత్వాలు విఫలం అయ్యాయి. అని ఆయన మండిపడ్డారు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రంలో జై భీమ్ రావు భారత్ పార్టీ కార్యాలయం ప్రారంభిస్తామన్నారు. మొట్టమొదటిగా నంద్యాల జిల్లా కొలిమిగుండ్లలో పార్టీ కార్యాలయం ప్రారంభించామని ఈ ప్రాంత వాసులు తమకు ఏదైనా సమస్యలను వస్తే పార్టీ కార్యాలయంలో తమ సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే న్యాయస్థానం ద్వారా సమస్యలు తప్పక పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు పక్క నిజాయితీగా ఉండి అన్యాయం జరిగితే ఏలాంటి వారికి అయినా న్యాయస్థానం ద్వారా కొద్దిగా ఆలస్యమైన గానీ సమస్యలు తప్పకుండా పరిష్కరించి న్యాయం చేస్తామని అన్నారు.

## చంద్రబాబు ఏడాది పాలన...చీకటి రోజులు

- రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో అరాచకం
- హామీల పేరుతో 5కోట్ల మంది ప్రజలకు వెన్నుపోటు
- వైకాపా నంద్యాల జిల్లా అధ్యక్షుడు,పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి




మన గళం,కల్లూరు : కూటమి ప్రభుత్వ ఏడాది పాలనా వైఫల్యాలపై వైయస్ఆర్‌సీపీ పుస్తకాన్ని ఆవిష్కరించింది. పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి శనివారం తన కార్యాలయంలో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి,కర్నూలు నగర మేయర్ బి వై రామయ్య లతో కలిసి, ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనను ప్రజలు వైయస్ జగన్ ఏడాది పాలనతో పోల్చి చూస్తున్నారన్నారు. వైయస్ జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసమన్నారు. వైయస్ఆర్‌సిపీ ప్రభుత్వం ప్రజల కోసం బంగారు భవిష్యత్తు నిర్మించిందని, చంద్రబాబు పాలన వాటిని విధ్వంసం చేయడానికే పరిమితమైందని ఆయన విమర్శించారు. ఏడాది విధ్వంసకర పాలనకు ఈ పుస్తకం అద్దం పడుతోందన్నారు. వాస్తవాలు తెలుసుకునేందుకు ప్రజలకు అందుబాటులో ఈ పుస్తకం ఉంచుతామన్నారు. చంద్రబాబు నేతృత్వంలో ఏడాది కిందట ఏర్పడిన కూటమి ప్రభుత్వం తన పాలనతో ప్రజలకు చీకటి రోజులను మిగిల్చిందని ఆయన మండిపడ్డారు.. చంద్రబాబు నాయుడు,ఆయన తనయుడు లోకేష్‌లు రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో ఒక అరాచకాన్ని సృష్టించారన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ కార్పొరేటర్లు, అనుబంధం విభాగాల జిల్లా,నియోజకవర్గ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న మంత్రి బి.సి.



మన గళం,కోవెలకుంట్ల : నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గం కోవెలకుంట్ల మండలం భీమునిపాడు గ్రామంలో బైక్ పై వెళుతూ ప్రమాదానికి గురైన భార్యాభర్తలను చూసి అటుగా వెళ్తున్న రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మానవత్వం చాటుకున్నారు. బనగానపల్లె నుంచి కడప జిల్లాకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వెళ్తున్న క్రమంలో చోటు చేసుకున్న. బైక్ యాక్సిడెంట్ లో ప్రమాదానికి గురైన భార్యాభర్తలను చూసి తక్షణమే తన కాన్వాయ్ ఆపి బాధితులను పరామర్శించి ప్రమాదంలో తగిలిన దెబ్బల గురించి బాధితులను అడిగి తెలుసుకొని ఆందోళనకు గురికావద్దంటూ ధైర్యం చెప్పి, ప్రమాదంలో బాధితులు స్వల్ప గాయాలకు గురికావడంతో వారికి ప్రాథమిక చికిత్స అందించేందుకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సహాయం అందించాలని అధికారులకు సూచించారు. ప్రమాదాన్ని చూసి తక్షణమే స్పందించి తన మానవత్వాన్ని చాటుకున్న మంత్రి తీరుపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## జూన్ 16 న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- అర్జీల పరిష్కారం సమాచారం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి కనుక్కోవచ్చు
- జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా

మన గళం,కర్నూలు కలెక్టరేట్ : జూన్ 16 వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అర్జీల పరిష్కారం సమాచారం కోసం 1100 కు ఫోన్ చేయవచ్చు .అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.. అలాగే అర్జీదారులు (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

## రక్తదాతకు ప్రశంసాపత్రం




మన గళం,కర్నూలు వైద్యం : ప్రపంచ రక్త దాన దినోత్సవం సందర్భంగా కర్నూలు నగరంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేస్తున్న సిపిఎం పార్టీ కర్నూలు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి. రాముడు. అనంతరం జరిగిన సభలో కర్నూలు జిల్లా కలెక్టర్ పి. రంజిత్ భాషా గారి చేతుల మీదుగా టి. రాముడు గారికి మెమొంటోను ప్రశంసా పత్రాన్నిఅందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ.ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కె జి. గోవింద్ రెడ్డి,. కెవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్ చైర్మన్ కెవి. సుబ్బారెడ్డి,. రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అరటి పండు తిన్నాక తొక్క పడేస్తున్నారా?



మనగళం : అరటిపండ్లు తినడానికి ఇష్టపడతారు. చాలా మంది అరటిపండ్లతో వివిధ రకాల రుచికరమైన డిజర్ట్స్ కూడా చేస్తారు. కానీ అరటిపండ్లు మాత్రమే కాదు, అరటి తొక్కలు కూడా ఉపయోగకరంగా ఉంటాయని మీకు తెలుసా? అవును, అరటిపండు తిని తొక్క పడేసే ముందు, మీరీ విషయం తప్పక తెలుసుకోవాలి. దాదాపు అందరూ అరటిపండ్లు తినడానికి ఇష్టపడతారు. చాలా మంది అరటిపండ్లతో వివిధ రకాల రుచికరమైన డిజర్ట్స్ కూడా చేస్తారు. కానీ అరటిపండ్లు మాత్రమే కాదు, అరటి తొక్కలు కూడా ఉపయోగకరంగా ఉంటాయని మీకు తెలుసా? అవును, అరటిపండు తిని తొక్క పడేసే ముందు, మీరీ విషయం తప్పక తెలుసుకోవాలి. అరటిపండ్ల తొక్కల వల్ల కలిగే వివిధ ఉపయోగాలు మీ రోజువారీ జీవితంలో బోలెడంత డబ్బును కూడా ఆదా చేస్తుంది. నిజానికి, అరటిపండ్లు మాత్రమే కాదు.. అరటి తొక్కలు కూడా మన చర్మానికి చాలా మేలు చేస్తాయి. డ్రై చర్మ సమస్యలతో బాధపడేవారు రాత్రి పడుకునే ముందు అరటి తొక్కలను ముఖంపై రుద్దడం ప్రయోజనకరంగా ఉంటుంది. ఇలా ఏడు రోజులు చేస్తే, చర్మం కాంతివంతంగా మారడం పక్కా. ఇక పగిలిన పెదవులతో బాధపడేవారు రాత్రి పడుకునే ముందు అరటిపండు తొక్కను పెదవులపై రుద్దాలి. దీనివల్ల పెదవులు మెరుస్తూ అందంగా మారుతాయి. ఇక సమస్య కూడా పరిష్కారమవుతుంది. బాల్కనీలో ఉంచిన మొక్కల ఆకులు తరచుగా మురికిగా మారుతుంటాయి. కానీ ఆకులను ఎక్కువ నీటితో శుభ్రం చేయడం వల్ల మొక్కకు హాని కలుగుతుంది. కాబట్టి మొక్క ఆకులను శుభ్రం చేయడానికి అరటి తొక్కలను ఉపయోగించవచ్చు. దంతాలు రోజురోజుకూ పసుపు రంగులోకి మారుతున్నాయా? అయితే దంతాలను తెల్లగా ఉంచుకోవడానికి అరటి తొక్కకు మించిన ప్రత్యామ్నాయం మరొకరటి లేదంటే అతిశయోక్తి కాదు. మీ దంతాలను శుభ్రం చేసుకోవడానికి టూత్‌పేస్ట్ కంటే అరటి తొక్క చాలా ప్రభావవంతంగా పని చేస్తుంది. రాత్రి పడుకునే ముందు అరటి తొక్కతో పళ్ళు తోముకోవాలి. ఇలా తరచూ చేయడం వల్ల దంతాలు తెల్లగా మారడం కేవలం వారం రోజుల్లోనే గమనిస్తారు.

## ఐస్ క్రీం తినడం వల్ల శరీరం నిజంగానే చల్లబడుతుందా?

మనగళం : ఐస్ క్రీం అంటే చాలా మందికి ఇష్టం.. దీనిని అన్ని వేళలా తినడానికి ఇష్టపడతారు.. ముఖ్యంగా వేసవిలో, చల్లటి పదార్థాలు తినాలని అనిపిస్తుంది. ఈ సీజన్‌లో ప్రజలు ఐస్ క్రీం ఎక్కువగా తీసుకుంటారు.. దాని నుంచి చల్లదనాన్ని పొందుతారు. కానీ ఐస్ క్రీం తినడం నిజంగా శరీరాన్ని చల్లబరుస్తుందా? ఐస్ క్రీం అంటే చాలా మందికి ఇష్టం.. దీనిని అన్ని వేళలా తినడానికి ఇష్టపడతారు.. ముఖ్యంగా వేసవిలో, చల్లటి పదార్థాలు తినాలని అనిపిస్తుంది. ఈ సీజన్‌లో ప్రజలు ఐస్ క్రీం ఎక్కువగా తీసుకుంటారు.. దాని నుంచి చల్లదనాన్ని పొందుతారు. కానీ ఐస్ క్రీం తినడం నిజంగా శరీరాన్ని చల్లబరుస్తుందా? లేదా ఇది కేవలం రుచి – మనసుకు సంతృప్తి కలిగించే విషయమా? తరచూ చాలా మందికి ఈ ప్రశ్నకు తలెత్తుతుంది.. ఈ దీనిపై నిపుణులు ఏం చెబుతున్నారు..? వైద్య శాస్త్రం ఎలాంటి అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తుంది.. ఐస్ క్రీం తినడం శరీరంపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతుంది..? ఈ ఆసక్తికర విషయాలను తెలుసుకోండి.. మనం ఐస్ క్రీం తిన్న వెంటనే నోటి లోపల దాని చల్లని ఉష్ణోగ్రతను అనుభవిస్తాము. దీనివల్ల నాలుక – నోటి నరాలు చల్లగా అనిపిస్తాయి. దీని ప్రభావం మెదడుకు చేరుకుంటుంది.. మెదడు మన శరీరం అంతటా ఈ చల్లదనాన్ని అనుభూతి చెందేలా చేస్తుంది. అందుకే మనం ఐస్ క్రీం తిన్న వెంటనే చల్లగా అనిపిస్తుంది. మౌంట్ సెయింట్ విన్సెంట్ విశ్వవిద్యాలయం ప్రకారం.. ఐస్ క్రీం నోటికి, గొంతుకు చల్లదనాన్ని మాత్రమే అందిస్తుంది. శరీరం లోపల దాని ప్రభావం భిన్నంగా ఉంటుంది. వాస్తవానికి, ఐస్ క్రీంలో అధిక మొత్తంలో చక్కెర – కొవ్వు ఉంటుంది. ఇది జీర్ణం కావడానికి సమయం పడుతుంది. ఐస్ క్రీం చల్లదనం కారణంగా, శరీరం జీవక్రియ ప్రక్రియ కొంచెం నెమ్మదిస్తుంది.. కానీ కొంత సమయం తర్వాత శరీరం దానిని వేడి చేయడానికి తన పనిని వేగవంతం చేస్తుంది. అంటే, మీరు కొద్దిసేపు చల్లగా అనిపించవచ్చు.. కానీ తరువాత శరీరం మరింత వేడిని ఉత్పత్తి చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. వేసవిలో శరీరం చల్లదనాన్ని కోరుకుంటుంది. చల్లటి పదార్థాలు తినడం – త్రాగడం వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుంది, కాబట్టి ఐస్ క్రీం కోసం డిమాండ్ పెరుగుతుంది. మనస్తత్వవేత్త డాక్టర్ ఎకె కుమార్



దీనిని ఇంద్రియ ఉపశమనం అని పిలుస్తారని తెలిపారు. అంటే శరీరం లోపలి నుండి చాలా చల్లగా లేకపోయినా, ఐస్ క్రీం తినడం మనసుకు ఉపశమనం ఇస్తుంది.. అందుకే వేసవిలో మనం ఐస్ క్రీం ఎక్కువగా తినడానికి ఇష్టపడతాము.

## గుడ్లను ఉడకబెట్టేటప్పుడు పగిలిపోకుండా ఉండాలంటే..!

మనగళం : సాధారణంగా చాలా సందర్భాలలో గుడ్లు ఉడకబెడుతున్నప్పుడు అవి పగిలిపోతుంటాయి..అలా పగిలినప్పుడు గుడ్డు వృధా అయిపోతుంది. సరిగ్గా ఉడకదు. అలా కాకుండా ఉండాలంటే.. గుడ్లని ఉడకబెట్టేటప్పుడు కొన్ని సింపుల్ టిప్స్ పాటిస్తే సరిపోతుంది. ఇలా చేస్తే పెంకు సులువుగా రావడమే కాదు గుడ్లలో అవసరమైన పోషకాలు చెక్కుచెదరకుండా ఉంటాయి. దీనికి అద్భుతమైన రుచి ఉంటుంది.గుడ్లు ఉడకబెట్టేటప్పుడు వాటికి సరిపడా పెద్ద సైజు గిన్నెను తీసుకోవాలి. గిన్నెలో గుడ్లు మొత్తం మునిగేవిధంగా నీరు పోయాలి. ఇలా చేయడం వల్ల గుడ్లు ఒకదానికొకటి తగలకుండా ఉంటాయి. దాంతో పగలకుండా ఉంటాయి. మీరు గుడ్లు ఉడకబెడుతున్న గిన్నెలోని నీటిలో ఒక టీస్పూన్ ఉప్పు వేయాలి. ఇలా చేస్తే గుడ్లు పగలకుండా ఉంటాయి. ఇలా ఉప్పు నీటిలో గుడ్లను ఉడకబెట్టడం వల్ల వాటి పెంకు తీయటం సులభంగా ఉంటుంది. అలాగే, చాలా మంది కోడిగుడ్లను ఫ్రిజ్‌లో నిల్వ చేస్తుంటారు. నేరుగా వంటకు ఉపయోగిస్తారు. అలా ఎప్పుడు చేయకూడదు. మొదటగా వాటిని గది ఉష్ణోగ్రతకు తీసుకురావాలి. ఆ తర్వాత వాటిని ఉడకబెట్టాలి. మీరు చల్లటి గుడ్లను నేరుగా వేడి నీటిలో ఉడకబెట్టినట్లయితే అవి పగిలిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. గిన్నెలో నీరు మరుగుతుండగా గుడ్లు ఎప్పుడు అందులో వేయకూడదు. అలావేస్తే గుడ్డు నీటిలోనే పగిలిపోతాయి. ఒక గిన్నెలో 3-4 గుడ్ల కంటే ఎక్కువ ఉడకబెట్టకూడదు. ఇలా కూడా అవి పగిలిపోయే అవకాశం ఉంటుంది. ఇకపోతే, గుడ్లు ఉడకబెట్టేటప్పుడు ఎక్కువ మంట మీద ఉడికించొద్దు. మీడియం వేడి మీద మరిగించాలి. మీరు ఇలా చేస్తే, అది పగలకుండా ఉంటుంది. సుమారు 15 నిమిషాలు ఉడికిన తర్వాత గ్యాస్ ఆఫ్ చేయాలి. ఇప్పుడు గుడ్లను వేడి నీటిలో నుంచి తీసి చల్లటి నీటిలో వేయాలి. సుమారు 10 నిమిషాల తరువాత వాటి పెంకులు తీయాలి. గుడ్డు పగలకుండా ఈజీగా వచ్చేస్తుంది.




## బ్యాంకుల్లో గోల్డ్ లోన్ తీసుకుంటున్నారా?.. ఒక్కసారి ఆలోచించండి!

మనగళం : హైదరాబాద్, మీకు గోల్డ్ లోన్ కావాలా? వెంటనే కావాలా? కుదువబెట్టిన బంగారం తక్కువ వడ్డీకి మరో చోట పెట్టాలనుకుంటున్నారా? వంటి ప్రకటనలు ఆకట్టుకుంటాయి. ప్రజల ఆర్థిక అవసరాల కోసం గోల్డ్ లోన్లు (%+శీశ్రీన రాశ్ఖఅ%) ఒక ఆకర్షణీయ ఎంపికగా కనిపిస్తాయి. అయితే, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (%=దీ×%) తాజాగా జారీ చేసిన నూతన నిబంధనలు గోల్డ్ లోన్ తీసుకునే వారికి కొత్త సవాళ్లను తెచ్చిపెట్టాయి. అవి ప్రజల పాలిట పిడుగులా మారాయి. గోల్డ్ లోన్ల చెల్లింపు కాలం, వడ్డీ రేట్లు, ఇతర షరతులు కఠినతరంగా మారాయి. ఒక్కో బ్యాంకులో ఈ నిబంధనలు వేర్వేరుగా అమలవుతున్నాయి. కానీ, రుణగ్రహీతలు ఇకపై జాగ్రత్తగా ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. వైద్య చికిత్స కోసం, పిల్లల చదువుల కోసం, వ్యాపారం నిమిత్తం, వ్యవసాయ అవసరాల కోసం తీసుకొనే రైతులు, మహిళలు, యువత ఇకపై జాగ్రతగా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తీసుకున్న అప్పు మొత్తం వడ్డీసహా ఏడాదిలోగా చెల్లించాలంటే యాడికెళ్లి తేవాలని బాధపడవద్దు. ముందే ఆర్థిక పరిస్థితులను అంచనా వేసుకొని గోల్డ్‌లోను కోసం ముందుకెళ్లాల్సి ఉన్నది. ఎందుకంటే.. ఆర్బీఐ 2025 డ్రాఫ్ట్ మార్గదర్శకాలు గోల్డ్ లోన్లపై కఠిన నియంత్రణలను తీసుకొచ్చింది. గతంలో గోల్డ్ లోన్ తీసుకుంటే ఏడాదికి ఏడాది రెన్యూవల్ చేసుకొనే సౌలభ్యం ఉండేది. కానీ, ఇప్పుడు దానికి తొలగించారు. 12 నెలలు గరిష్ఠ పరిమితి విధించారు. 12 నెలలు దాటితే కచ్చితంగా రుణంతోపాటు వడ్డీ మొత్తం చెల్లించాల్సిందే. మళ్లీ రుణంగా కూడా అదే రోజు ఇవ్వరు. రుణం చెల్లించిన తర్వాత మరుసటి రోజు తిరిగి ఆ బంగారం ద్వారా రుణం నిబంధన పెట్టారు.

నిబంధనల్లో కీలక అంశాలు

లోన్-టు-వాల్యూ నిష్పత్తి ప్రకారం బంగారం విలువలో 75 శాతం వరకు మాత్రమే రుణం పొందవచ్చు. రుణ మొత్తాన్ని వడ్డీతోసహా గరిష్ఠంగా 12 నెలల్లోగా చెల్లించాలి. ఈఎంఐ ఆధారిత రుణాలకు 36 నెలలు వరకు గడువు ఉన్నది. రుణం పునరుద్ధరించాలంటే కూడా కొన్ని షరతులు విధించింది. రుణం స్టాండర్డ్ స్థితిలో ఉండాలి. మొత్తం వడ్డీ చెల్లించబడి, కొత్త క్రెడిట్ అంచనా ఉండాలి. బంగారం విలువ నిర్ధారణ, వేలం ప్రక్రియలో పూర్తి పారదర్శకత తప్పనిసరిగా ఉండాలి. రుణ చెల్లింపు విఫలమైతే, బంగారం వేలం వేస్తారు. ఈ మేరకు రుణగ్రహీతకు సమాచారం ఇస్తారు. ఈ నిబంధనలు రుణగ్రహీతల రక్షణ, పారదర్శకతను పెంచడానికి ఉద్దేశించినవైనప్పటికీ, చెల్లింపు కాలం తగ్గడం, కఠిన షరతులు ప్రజలకు ఆర్థిక ఒత్తిడిని



తెచ్చిపెట్టే ప్రమాదం ఉన్నది.

ఒక్కో బ్యాంకు ఒక్కో వడ్డీ

గోల్డ్ లోన్ల వడ్డీ రేట్లు, ప్రాసెసింగ్ ఫీజులు కూడా బ్యాంకును బట్టి మారుతున్నాయి. కొన్ని బ్యాంకులు 88 శాతం వడ్డీ వేస్తే, మరికొన్ని కొంత ఎక్కువగా, మరికొన్ని తక్కువ వడ్డీలు విధిస్తున్నాయి. ప్రాసెసింగ్ ఫీజు విషయంలో కూడా వివిధ టారీఫ్‌లను కొనసాగిస్తున్నాయి. కొన్ని బ్యాంకులు 3 లక్షల వరకు ప్రాసెసింగ్ ఫీజు విధించకపోగా, మరికొన్ని బ్యాంకులు విధిస్తున్నాయి.

## అమెజాన్ వ్యవస్థాపకుడికి షాక్.. కుబేరుల్లో రెండో స్థానం కోల్పోయిన జెఫ్ బెజోస్



మనగళం : ప్రపంచ కుబేరుల జాబితాలో అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్‌కి షాక్ తగిలింది. ఫోర్బ్స్ తాజా ర్యాంకింగ్స్ ప్రకారం, ఒరాకిల్ వ్యవస్థాపకుడు ల్యారీ ఎలిసన్, ఒక్కరోజులో %వి%26 బిలియన్లు లాభపడి, తన మొత్తం సంపదను 258 బిలియన్లకు పెంచుకున్నారు. ఈ భారీ వృద్ధి ద్వారా ఒరాకిల్ స్టాక్ ధర 13% పెరిగి, ఒక్కరోజులో అతిపెద్ద లాభం నమోదు కావడంతో ఈ సంస్థ ఆదాయం పెరిగింది. ఈ మార్పు ద్వారా జెఫ్ బెజోస్ %వి%227.8 బిలియన్లతో నాలుగో స్థానానికి చేరుకున్నారు.

కొత్త జాబితాలో అగ్రస్థానం..

2017 నుంచి రెండో అత్యంత ధనవంతుడిగా కొనసాగుతూ వచ్చిన జెఫ్ బెజోస్ స్థానాన్ని తాజాగా ల్యారీ ఎలిసన్ దక్కించుకున్నారు. మెటా %జజుూ% మార్క్ జుకర్‌బర్గ్ %వి%239.3 బిలియన్లతో మూడో స్థానానికి చేరారు. మరోవైపు ప్రపంచంలో అత్యంత ధనవంతుడిగా టెస్లా %జజుూ% ఎలాన్ మస్క్ %వి%408.2 బిలియన్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ఈ పరిణామం టెక్ దిగ్గజాల మధ్య పోటీని మరింత ఆసక్తికరంగా మార్చింది. ప్రతి ఒక్కరూ తమ సంస్థల వృద్ధి, స్టాక్ మార్కెట్ ప్రదర్శనలపై దృష్టి పెట్టి, తమ స్థాయిని మెరుగుపరచుకోవడానికి కృషి చేస్తున్నారు.

## ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం.. పెరగనున్న పెట్రోల్, డీజిల్ ధరలు

మనగళం : ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య భీకరంగా యుద్ధం నడుస్తోంది. రెండు దేశాలు మిస్సైల్స్, డ్రోన్లతో దాడులు చేసుకుంటున్నాయి. నిన్న ఇరాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది. ఇందుకు ప్రతిగా ఇరాన్ సైతం ఇజ్రాయెల్‌పై దాడులకు దిగింది. ఈ రెండు దేశాల మధ్య యుద్ధం కారణంగా ముడి చమురు ధరలు భారీగా పెరిగాయి. సాధారణం కంటే 10 శాతం ఎక్కువైపోయాయి. ముడి చమురు ధరలు ఇంత పెద్ద మొత్తంలో ఒకేసారి పెరగటం జనవరి నుంచి ఇదే మొదటి సారి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 74.23 డాలర్ల దగ్గర ట్రేడ్ అయింది. రానున్న రోజుల్లో ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం మరింత పెరిగే అవకాశం ఉంది. అలా అయితే.. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 80 నుంచి 100 డాలర్ల వరకు పెరిగే అవకాశం ఉంది. ముడిచమురు ధరలు పెరిగితే.. ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ వంటి దేశీయ ఇంధన విక్రయ కంపెనీలపై తీవ్ర ప్రభావం పడుతుంది. క్రూడ్ ఆయిల్ ధర ఒక డాలర్ పెరిగితే, మన ఇంధన కంపెనీల లాభానికి 200-300 కోట్ల రూపాయల వరకు గండి పడుతుందని అంచనా. ముడిచమురు ధర 80 డాలర్లు దాటి మరింత ఎగబాకితే




దేశీయంగా ఇంధన కంపెనీలు పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచాల్సి రావచ్చు. దాంతో వాహనదారులపై భారం పెరగడంతో పాటు సరుకు రవాణా వ్యయం పెరుగుతుంది. మార్కెట్లో నిత్యావసరాల ధరలు కూడా ఎగబాకే ప్రమాదం ఉంది. ద్రవ్యోల్బణం పెరిగితే ఆర్‌బీఐ వడ్డీరేట్ల తగ్గింపు ప్రక్రియకూ అడ్డుకట్ట పడుతుంది. మొత్తానికి ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధంతో ప్రపంచ దేశాలు భారీగా నష్టపోనున్నాయి. ఇండియాలోని గ్రామ ప్రజలపై కూడా ఈ ప్రభావం ఉండనుంది.

## భారీగా పెరిగిన ముడిచమురు ధర


మనగళం : అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్లో ముడిచమురు ధరలు ఒక్క రోజులో భారీగా పెరిగాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర ఒక దశలో 78.50 డాలర్లకు ఎగబాకినప్పటికీ.. మళ్లీ కాస్త తగ్గి 74.80 డాలర్ల వద్ద స్థిరపడింది. ముడిచమురు ఎగుమతి దేశాల్లో ఒకటైన ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు జరపడం ఇందుకు ప్రధాన కారణం. అంతర్జాతీయ ట్రెండ్‌కు అనుగుణంగా మన మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లోనూ జూన్ డెలివరీ క్రూడ్ కాంట్రాక్టు ధర ప్రారంభ ట్రేడింగ్‌లో ఏకంగా 10.08 శాతం (రూ.578) పెరిగి సరికొత్త గరిష్ఠ స్థాయి రూ.6,311కి ఎగబాకింది. ఆ తర్వాత కాస్త తగ్గి 7.38 శాతం పెరుగుదలతో రూ.6,156 స్థాయిలో ట్రేడైంది. ఇజ్రాయెల్ దాడికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ ఇప్పటికే హెచ్చరించింది. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగితే బ్రెంట్ క్రూడాయిల్ రేటు 80 డాలర్లు దాటేయవచ్చని కమోడిటీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇరాన్ అణు కేంద్రాలు, సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడి చేసిన ఇజ్రాయెల్.. ఆ దేశ చమురు కేంద్రాలను మాత్రం తాకలేదు. ప్రస్తుతం ఇరాన్ 21 లక్షల బ్యారెళ్ల ముడిచమురును ఎగుమతి చేస్తోంది. భవిష్యత్‌లో ఇజ్రాయెల్ ఇరాన్ చమురు సరఫరాకు భంగం కలిగించినా, ఇరాన్ స్ట్రెయిట్ ఆఫ్ హోర్మజ్ నుంచి ఆయిల్ సరఫరాను అడ్డుకున్నా ధరలు మళ్లీ 100 డాలర్ల దిశగా దూసుకెళ్లవచ్చన్న ఆందోళనలూ వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ క్రూడ్ సరఫరాలో 20 శాతం ఈ సముద్ర మార్గం ద్వారానే జరుగుతుండడమే ఇందుకు కారణం




ఇంధనం, ఎయిర్‌లైన్స్, పెయింట్స్ షేర్లు డౌన్

ముడిచమురు ధరల పెరుగుదలతో ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ వంటి దేశీయ ఇంధన విక్రయ కంపెనీలపై తీవ్ర ప్రభావం పడనుంది. క్రూడ్ ధర ఒక డాలర్ పెరిగితే, మన ఇంధన కంపెనీల లాభానికి రూ.200-300 కోట్ల వర కు గండి పడుతుందని అంచనా. పెయింట్ల కంపెనీల తయారీ వ్యయాల్లో సగం వాటా ముడిచమురుదే. ఈ నేపథ్యంలో ఇంధన, ఎయిర్‌లైన్స్, పెయింట్స్, టైర్ల తయారీ సంస్థల షేర్లు గణనీయంగా నష్టపోయాయి. ప్రభుత్వ రంగ ఇంధన విక్రయ కంపెనీలైన ఐఓసీ షేరు బీఎసఈలో 1.78 శాతం క్షీణించగా.. బీపీసీఎల్ 1.90 శాతం, హెచ్‌పీసీఎల్ 1.41 శాతం తగ్గాయి. ఒకదశలోనైతే బీపీసీఎల్ 6.11 శాతం, హెచ్‌పీసీఎల్ 5.34 శాతం, ఐఓసీ 3.91 శాతం వరకు పతనమైనప్పటికీ మళ్లీ కాస్త కోలుకున్నాయి. విమానయాన రంగంలో ఇండిగో స్టాక్ 3.71 శాతం, స్పైస్‌జెట్ 1.95 శాతం తగ్గాయి. పెయింట్ల తయారీదారుల్లో ఇండిగో పెయింట్స్ 2.63 శాతం, బెర్జర్ పెయింట్స్ 0.59 శాతం, ఏషియన్ పెయింట్స్ 0.14 శాతం నష్టపోయాయి. టైర్ల తయారీదారుల్లో సియట్, అపోలో టైర్స్ ఒక శాతానికి పైగా నష్టపోయాయి.

# కేక పెట్టించిన కావ్య కళ్యాణ్ రామ్



మన గళం తెలుగులో చాలా మంది చైల్డ్ ఆర్టిస్ట్ లు తమ నటనతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. పదుల సంఖ్యలో చైల్డ్ ఆర్టిస్ట్ లుగా చేసి ఇప్పుడు హీరో, హీరోయిన్స్ గా మారిన వారు చాలా మంది ఉన్నారు. వారిలో ఈ ముద్దుగుమ్మ ఒకరు ఆమె కావ్య కళ్యాణ్ రామ్. ఈ చిన్నది చైల్డ్ ఆర్టిస్ట్ గా ఎన్నో సినిమాల్లో నటించి ఆకట్టుకుంది. గంగోత్రి సినిమాతో చైల్డ్ ఆర్టిస్ట్ గా మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ అమ్మడు. ఇక ఇప్పుడు హీరోయిన్ గా మారి సినిమాలు చేస్తుంది. మసూద సినిమాతో హీరోయిన్ గా మారింది కావ్య కళ్యాణ్ రామ్. తొలి సినిమాతోనే హీరోయిన్ గా ఆకట్టుకుంది. తన నటనతో మెప్పించింది ఈ చిన్నది. ఆతర్వాత వేణు దర్శకత్వంలో బలగం సినిమాలో నటించింది. బలగం సినిమా ఎంత పెద్ద విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కానీ ఆతర్వాత ఆమె హీరోయిన్ గా చేసిన ఉస్తాద్ సినిమా డిజాస్టర్ అయ్యింది. శ్రీ సింహ హీరోగా నటించిన ఈ సినిమా తర్వాత కావ్య సినిమాలకు గ్యాప్ తీసుకుంది. సోషల్ మీడియాతోనే ఎక్కువ సమయం గడుపుతుంది. 2023లో వచ్చిన ఉస్తాద్ సినిమా తర్వాత కావ్య కొత్త సినిమాను అనౌన్స్ చేయలేదు. కానీ సోషల్ మీడియాలో మాత్రం తన అందాలతో ప్రేక్షకులను కవ్విస్తుంది కావ్య. చాలా కాలంగా కావ్య సినిమాలకు దూరంగా ఉంటుంది. రీసెంట్ డేస్ లో కావ్య షేర్ చేస్తున్న ఫోటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఈ చిన్నది తన గ్లామర్ ఫోటోలతో కవ్విస్తుంది. ఈ ముద్దుగుమ్మ ఫోటోలకు నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. ఇంత అందమైన భామకు సినిమా ఆఫర్స్ ఎందుకు రావడం లేదు అంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్స్.

# మళ్లీ వాయిదా పడిన 'కుబేర' ట్రైలర్..




మన గళం టాలీవుడ్ దర్శకుడు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం కుబేరా. ధనుష్, నాగార్జున, రష్మిక మందాన్న ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ సినిమా ట్రైలర్‌ను మొదటగా జూన్ 13న విడుదల చేస్తామని చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. అహ్మదాబాద్ విమాన ప్రమాదం జరగడంతో ట్రైలర్ విడుదల వాయిదా వేసి జూన్ 14న విడుదల చేస్తామని ప్రకటించింది. అయితే తాజాగా జూన్ 14న కూడా ట్రైలర్ విడుదలను వాయిదా వేసినట్లు తెలిపింది. ఈ సినిమా ట్రైలర్‌ను జూన్ 15న జరుగబోతున్న కుబేర గ్రాండ్ ప్రీ-రిలీజ్ ఈవెంట్లో విడుదల చేయబోతున్నట్లు తాజాగా ప్రకటించింది.

# నిజమైన సక్సెస్ అంటే అదే..



మన గళం : టాలీవుడ్ అగ్ర నటి సమంత సక్సెస్ గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. గతంలో తానకి విజయాలంటే కేవలం సినిమాల విజయాలు, స్టార్‌డమ్ అని భావించేదాన్నని అయితే ఇప్పుడు తన దృష్టిలో స్వేచ్ఛ అనేదే అసలైన సక్సెస్ ఆమె స్పష్టం చేశారు. ఈ విషయంపై ఇటీవల ఒక ఇంటర్వ్యూలో సమంత మాట్లాడుతూ.. విజయానికి నిర్వచనం ఏమిటని అడిగితే నేను వెంటనే స్వేచ్ఛ అని చెబుతాను. నిరంతరం అభివృద్ధి చెందడం, పరిణతి సాధించడం, దేనికీ బందీగా ఉండకపోవడమే నా దృష్టిలో నిజమైన స్వేచ్ఛ. అదే అసలైన విజయం అని సమంత వివరించారు. ప్రస్తుతం తాను చేస్తున్న పనులు తనకు ఎంతో ఉత్సాహాన్నిస్తున్నాయని, వాటిని పూర్తి చేయడం కోసం ప్రతిరోజూ ఎంతో ఆనందంగా నిద్రలేస్తున్నానని ఆమె తెలిపారు. బహుశా నా చుట్టూ ఉన్నవారు గతంతో పోలిస్తే నేను ఇప్పుడు విజయం సాధించలేదని అనుకోవచ్చు. కానీ నా వ్యక్తిగత దృష్టిలో నేను గతం కంటే ప్రస్తుతం ఎక్కువ సక్సెస్‌గా ఉన్నాను అని సమంత తెలిపారు. ప్రస్తుతం రక్త బ్రహ్మాండ్ అనే సినిమాలో నటిస్తున్న సమంత ఇటీవల 'శుభం' అనే చిత్రంతో నిర్మాతగా కూడా మారిన విషయం తెలిసిందే. ఈ సినిమాలో అతిథి పాత్రలో మెరిసిన సమంత, ఇప్పుడు 'మా ఇంటి బంగారం' అనే మరో చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్వరలోనే మరిన్ని వరుస చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వస్తానని ఆమె అభిమానులకు హామీ ఇచ్చారు.

# థగ్ లైఫ్ డిజాస్టర్ టాక్..



మన గళం : ప్రముఖ నటుడు కమల్ హాసన్ నటించిన థగ్ లైఫ్ చిత్రం జూన్ 5న విడుదలై బాక్సాఫీస్ దగ్గర డిజాస్టర్ అయింది. భారీ అంచనాల నడుమ ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఏ మాత్రం అలరించలేకపోయింది. మరోవైపు ఈ మూవీ కర్ణాటకలో విడుదల కాకపోయే సరికి భారీ నష్టాలు చవి చూసింది. 'థగ్ లైఫ్' సినిమా గురించి అది విడుదలైన రెండు మూడు రోజులకే జనాలు మాట్లాడుకోవడం మానేశారు. కమల్ గత చిత్రం భారతీయుడు 2 భారీ డిజాస్టర్ అయింది అనుకుంటే దానికన్నా పెద్ద డిజాస్టర్‌గా థగ్ లైఫ్ నిలిచింది. ఈ చిత్రంలో సింబు, జోజు జార్జ్, త్రిష, అభిరామి, నాజర్ వంటి అగ్ర నటులు నటించారు. మణిరత్నం దర్శకత్వం వహించిన థగ్ లైఫ్ చిత్రానికి ఏ.ఆర్.రెహమాన్ సంగీతం అందించారు. అయితే 'నాయకుడు' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత మణిరత్నం, కమల్ హాసన్ కాంబినేషన్లో వచ్చిన ఈ చిత్రం సరికొత్త రికార్డ్స్ క్రియేట్ చేస్తుందని అందరు అనుకున్నారు. కాని ఏ మాత్రం అలరించలేకపోయింది. విడుదలైనప్పటి నుంచి నెగిటివ్ టాక్ రావడంతో 'థగ్ లైఫ్' బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. వారం రోజుల్లో కూడా 100 కోట్ల మార్క్ దాటలేకపోవడంతో ఈ చిత్రం డిస్ట్రిబ్యూటర్లకు కూడా నష్టాలను మిగిల్చింది.ఇక ఈ మూవీకి సంబంధించి 130 కోట్లకు ఓటీటీ హక్కులను నెట్‌ఫ్లిక్స్ కొనుగోలు చేసింది. అయితే, ఇప్పుడు చిత్రం ఫ్లాప్ కావడంతో ఆ మొత్తం ఇవ్వలేమని నెట్‌ఫ్లిక్స్ వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. 30 కోట్లు తగ్గిస్తేనే విడుదల చేస్తామని నెట్‌ఫ్లిక్స్ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఇక ఇదిలా ఉంటే థగ్ లైఫ్ సినిమా విడుదలకు ముందు కన్నడ భాష గురించి కమల్ చేసిన కామెంట్స్ కన్నడిగులకు కోపం తెప్పించిన విషయం తెలిసిందే. తమిళం నుంచే కన్నడ భాష పుట్టిందని కమల్ చెప్పడంతో కర్ణాటక రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. దీంతో కర్ణాటకలో ఈ సినిమా విడుదలను సైతం బ్యాన్ చేశారు. ఒకవేళ కర్ణాటకలో ఎక్కడైనా థగ్ లైఫ్ సినిమాను రిలీజ్ చేస్తే థియేటర్లు తగలబెట్టేస్తామని వార్నింగ్ సైతం ఇచ్చాయి పలు సంస్థలు. థగ్ లైఫ్‌పై నిషేధాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ పై సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. ఈ మేరకు కర్ణాటక ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ జూన్ 17కి వాయిదా వేసింది

# 40 ఏళ్ల వయసులో ఇదెక్కడి మ్యాజిక్ మావా..




మన గళం మేజర్ లీగ్ క్రికెట్ 2025లో టెక్సాస్ సూపర్ కింగ్స్, ఎంఐ న్యూయార్క్ మధ్య జరిగిన ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో, టెక్సాస్ సూపర్ కింగ్స్ కెప్టెన్ ఫాఫ్ డు ప్లెసిస్ పట్టిన ఒక అద్భుతమైన క్యాచ్, మ్యాచ్ గమనాన్ని పూర్తిగా మార్చేసింది. ఈ క్యాచ్‌తో మైఖేల్ బ్రాస్‌వెల్ ఔట్ అవ్వగా, టెక్సాస్ కేవలం 3 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఎంఐ న్యూయార్క్ 186 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆ జట్టు టాప్ ఆర్డర్ త్వరగానే కుప్పకూలి 24 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. అయితే, మోనంక్ పటేల్ (62 పరుగులు), మైఖేల్ బ్రాస్‌వెల్ (38 పరుగులు) నాలుగో వికెట్‌కు 95 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టును తిరిగి పోటీలోకి తెచ్చారు. బ్రాస్‌వెల్ 21 బంతుల్లో 38 పరుగులు చేసి ప్రమాదకరంగా మారాడు. ఈ దశలో ఆట ఎంఐ న్యూయార్క్ వైపు మొగ్గు చూపుతున్నట్లు అనిపించింది. ఎంఐ న్యూయార్క్ ఇన్నింగ్స్ 14వ ఓవర్‌లో, ఆడమ్ మిల్న్ బౌలింగ్‌లో బ్రాస్‌వెల్ ఆఫ్ సైడ్ మీదుగా గాల్లోకి షాట్ కొట్టాడు. అది బౌండరీ లైన్‌కు వెళు_న్నట్లు అనిపించింది. కానీ, మిడ్-ఆఫ్ వద్ద ఫీల్డింగ్ చేస్తున్న ఫాఫ్ డు ప్లెసిస్, తన 40వ ఏట కూడా అద్భుతమైన చురుకుదనాన్ని ప్రదర్శిస్తూ, కుడివైపు పూర్తి స్థాయిలో దూకి, ఒక చేత్తో ఆ బంతిని అందుకున్నాడు. ఈ క్యాచ్ కేవలం కొన్ని అంగుళాల దూరంలో నేలను తాకే లోపే అతని చేతిలోకి వచ్చింది. డు ప్లెసిస్ పట్టిన ఈ అద్భుతమైన క్యాచ్‌తో బ్రాస్‌వెల్ ఔట్ అవ్వడం ఎంఐ న్యూయార్క్‌కు పెద్ద దెబ్బ. ఈ వికెట్ పడటంతో వారి భాగస్వామ్యం బద్దలైంది. దీంతో ఆ జట్టు దూకుడు ఆగిపోయింది. ఈ క్యాచ్ బ్యాటింగ్ జట్టులో ఉత్సాహాన్ని పూర్తిగా మార్చేసింది. బ్రాస్‌వెల్ ఔటైన తర్వాత, ఎంఐ న్యూయార్క్ వేగంగా వికెట్లను కోల్పోయింది. చివరకు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 182 పరుగులు మాత్రమే చేసి, 3 పరుగుల తేడాతో ఓటమి పాలైంది.

# తొలి సెషన్‌లోనే సఫారీలకు షాక్.. బిగ్ వికెట్ తీసిన కమిన్స్..!




మన గళం లార్డ్స్ మైదానంలో జరుగుతున్న డబ్ల్యూటీసీ ఫైనల్లో విజయం దిశగా సాగుతున్న దక్షిణాఫ్రికాకు షాక్. నాలుగో రోజు తొలి సెషన్ ప్రారంభమైన 10 నిమిషాల్లోనే ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ వికెట్ సాధించాడు. నిన్నటి నుంచి క్రీజులో పాతుకుపోయిన తెంబ బవుమా(66)ను ఔట్ చేసి కంగరూలకు ఊరటనిచ్చాడు. బవుమా డిఫెన్స్ చేద్దామనుకున్న బంతి బంతి ఎడ్జ్ తీసుకోగా వికెట్ కీపర్ అలెక్స్ క్యారీ ఒడుపుగా అందుకున్నాడు. దాంతో, మూడో వికెట్147 పరుగుల భాగస్వామానికి తెరపడింది. ప్రస్తుతం సెంచరీ హీరో మర్క్‌రమ్(106 నాటౌట్)కు జతగా ట్రిస్టన్ స్టబ్స్ క్రీజులో ఉన్నాడు. ఇంకా దక్షిణాఫ్రికా చరిత్రాత్మక విజయానికి 64 పరుగులు అవసరం.

# లార్డ్స్‌లో అద్భుత ఘట్టం..




మన గళం ప్రతష్మాత్మక లార్డ్స్ మైదానంలో దక్షిణాఫ్రికా విజయగర్జన చేసింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్లో ఆస్ట్రేలియాపై అద్భుత విజయంతో తొలిసారి ఐసీసీ ట్రోఫీలో ఛాంపియన్‌గా అవతరించింది. తెంబ బవుమా సారథ్యంలోని సఫారీ జట్టు అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ.. తమ 27 ఏళ్ల కలకు రూపమిచ్చింది. డబ్ల్యూటీసీ మూడో సీజన్‌లో సూపర్ విక్టరీతో చరిత్ర సృష్టించింది. ఆసీస్ నిర్దేశించిన 282 పరుగుల లక్ష్యాన్ని ఆడుతూ పాడుతూ ఛేదించింది ప్రొటిస్ టీమ్. అంతే.. లారడ్స్‌లో అద్భుత ఘట్టం అవిష్కృతమైంది. దక్షిణాఫ్రికా ఆటగాళ్లు చెమర్చిన కళ్లతో, ఉప్పొంగిన హృదయాలతో మేము సాధించాం అని సంబురాలు చేసుకున్నారు. జూన్ 14.. దక్షిణాఫ్రికాక్రికెట్‌లో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు. ఇక్కడ ఇప్పటివరకూ రెండు పర్యాయాలు మాత్రమే సాధ్యమైన 280 ప్లస్ లక్ష్య ఛేదన రికార్డును సఫారీ జట్టు బ్రేక్ చేసింది. తమ ఆటకు తిరుగులేని చాటుతూ కంగారూలు నిర్దేశించిన భారీ టార్గెట్‌ను ఉఫ్‌మని ఊది పడేసింది. తొలి రెండు రోజులు కమిన్స్ సేన పట్టుబిగించినా.. సంకల్పం సడలించని సఫారీలు మూడో రోజు నుంచి మ్యాచ్‌ను తమ గుప్పిట్లోకి తీసుకున్నారు.




Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310